RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 304 ISSUE NO : 304 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, జూన్,3, 2026 Wednesday, June, 3, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

పాలకుల తప్పులకు ప్రజలను

## బాధ్యులను చేయొద్దు

- ఓ విశ్లేషకుడు అమిత్ షాతో తన భేటీపై తప్పుగా మాట్లాడటంతో వివాదం మొదలైందన్న పవన్
- తనకు తెలంగాణ ప్రజలంటే గౌరవం అని వెల్లడి
- పాలకులను మాత్రమే తాను వ్యతిరేకిస్తున్నాని స్పష్టీకరణ



**హైదరాబాద్,జూన్2,తెలంగాణ దిశ :**
ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య కొందరు కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఇది దేశ సమగ్రతకే ప్రమాదమని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పాలకుల తప్పులకు ప్రజలను బాధ్యుల్ని చేయడం సరికాదని, తాను ఎప్పుడూ తెలంగాణ ప్రజలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల విషయంలో ఇటీవల తనపై జరుగుతున్న దుష్ప్రచారం పట్ల తీవ్రంగా స్పందించారు."అసలు ఈ గొడవ ఎందుకు, ఎక్కడ మొదలైందంటే... నేను గౌరవించే ఓ రాజకీయ విశ్లేషకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారితో నా భేటీ గురించి మీడియాలో తప్పుడు వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలి

- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
- ప్రభుత్వ పురోగతిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి
- అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని హర్షం

### రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్2,తెలంగాణ దిశ :**
ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన కల అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటే మార్గమని తెలిపారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. దీనికి ప్రజల అండదండలు, సహకారం కావాలని కోరారు. ప్రజల ఆశీర్వాదంతో ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఆయన, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీఎం జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.రెండున్నరేళ్లలో అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పై అభిమానం చూపారని సీఎం రేవంత్ తెలిపారు. ఈ ఆదరణ తమ ప్రభుత్వంపై మరింత బాధ్యతను మోపిందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని తరహాలో తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాచరిక ఆలోచనలను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని వ్యాఖ్యానించారు. 30 నెలల్లో ప్రజల ఆశలు,



ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించామని పేర్కొన్నారు. 2047 విధాన పత్రంలో రైతులకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 2.36 కోట్ల టన్నుల పంట దిగుబడులు రావడం గర్వకారణమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతుల నుంచి చివరి గింజ వరకూ కొంటామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించారు. తెలంగాణ హక్కుల సాధన కోసం అన్ని వేదికల్లో పోరాడుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్‌కు తిరిగి ప్రాణం పోస్తున్నామని పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. మరోవైపు తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రూ.లక్ష కోట్ల రుణాలిస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందజేశామన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు రూ.10 వేల కోట్ల విలువైన ప్రయాణాలు సాగించారన్నారు. తెలంగాణ సాధన కోసం నిరుద్యోగ యువత పోరాటం చేసిందని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. ఉద్యోగ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు.

తెలుగు జాతి

## ఎప్పుడూ ఒక్కటే

- రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీ పడాలన్న చంద్రబాబు
- హైదరాబాద్, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలుగా ఎదగాలని ఆకాంక్ష

**అమరావతి,జూన్2,తెలంగాణ దిశ :**



తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియ జేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... రెండు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినప్పటికీ, తెలుగు జాతి ఎప్పుడూ ఒక్కటేనని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

380 పాయింట్లు

## పెరిగిన సెన్సెక్స్

### ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు

**న్యూఢిల్లీ,జూన్2**
భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. ఐటీ, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు సానుకూలంగా స్పందించాయి. అయితే, భారత్–అమెరికా మధ్య కీలక వాణిజ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు.



భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం

## జోక్యం కుదరదు

- ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- - భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు
- ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,జూన్2**
భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది.నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ స్పందించింది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలతో మాట్లాడడమే కాకుండా, యూకే ప్రభుత్వంతో కూడా మాట్లాడామని చెప్పారు. యూకే ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించాలని కోరుకుంటున్నామని, ఎందుకంటే, భారత్‌ను బ్రిటీషర్లు పరిపాలించిన చరిత్రతో ఈ సమస్యకు సంబంధం ఉందని వివరించారు.అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే, నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందని ఆయన వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారం రేపాయి. ప్రభుత్వ వైఖరిని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి వివరణ ఇచ్చింది. ప్రధాని వ్యాఖ్యలు సరిహద్దులోని 'దస్‌గజ' (నో–మ్యాన్స్ ల్యాండ్) ప్రాంతంలో ఇరు దేశాల పౌరుల భూ వినియోగానికి సంబంధించినవని, అధికారిక ప్రాదేశిక వాదనలకు కాదని పేర్కొంది

ఇళ్లలో, ఆలయాల్లో ఉన్న బంగారాన్ని

## రీసైకిల్ చేయాలి

### బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం

**న్యూఢిల్లీ,జూన్2**
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు.భారత్



ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం.

సీబీఎస్ఈ

## పోర్టల్‌పై సైబర్ దాడి

- ఫైళ్ల దొంగతనం కోసం లక్ష సార్లు యత్నించినట్లు సీబీఎస్ఈ బోర్డు వెల్లడి.
- దాడులు జరిగినా పోర్టల్ నార్మల్‌గా పనిచేసిందని ప్రకటన
- మధ్యాహ్నానికి 18 వేల దరఖాస్తులు పూర్తయ్యాయని వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్2**
సీబీఎస్ఈ వెబ్‌పోర్టల్‌పై హ్యాకర్లు భారీ సైబర్ దాడికి తెగబడ్డారు. విద్యార్థుల రీ–ఎవాల్యుయేషన్, వెరిఫికేషన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజే ఈ ఘటన జరిగింది. అయితే ఈ దాడులను తిప్పికొడుతూ పోర్టల్ ఆగకుండా పనిచేస్తోందని అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి వెబ్‌సైట్ యథావిధిగా సేవలందిస్తోందని సీబీఎస్ఈ స్పష్టం చేసింది.

**రెండు నిమిషాల్లో ముప్పేట దాడి**

ఈ సైబర్ దాడికి సంబంధించిన వివరాలను సీబీఎస్ఈ 'ఎక్స్' వేదికగా పంచుకుంది. హ్యాకర్లు ఒకేసారి పెద్ద ఎత్తున 'డినైల్ ఆఫ్ సర్వీస్' దాడికి ఒడిగట్టారు.

## తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా? రావొద్దనడానికి మీరెవరు

- తెలంగాణలో ఇకపై జనసేన పోటీ చేస్తుందని పవన్ ప్రకటన
- బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్

**హైదరాబాద్,జూన్2**
తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. తనపై కొందరు చేస్తున్న విమర్శలు, బెదిరింపుల నేపథ్యంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఘాటుగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావని, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను



ప్రశ్నిస్తున్నారు. దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# నవజాత శిశువుల చర్మ సంరక్షణ కోసం.. హిమాలయ బేబీకేర్ సరికొత్త సోప్స్ ఆవిష్కరణ




**విశాఖపట్నం , జూన్ 02, (తెలంగాణ దిశ) :** నవజాత శిశువుల చర్మ సంరక్షణ కోసం హిమాలయ బేబీకేర్ సరికొత్త సోప్స్ ను ఆవిష్కరించింది. సున్నితమైన చర్మ సంరక్షణ, వేసవి కాలంలో వాతావరణ మార్పుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'హిమాలయ జెంటిల్ బేబీ సోప్', 'రిఫ్రెషింగ్ బేబీ సోప్'లను మార్కెట్లోకి విడుదల చేసింది. 'కేవలం శుభ్రపరచడం మాత్రమే కాదు.. అంతకు మించిన సంరక్షణ' అనే ముఖ్య సందేశంతో కంపెనీ రెండు కొత్త డిజిటల్ వీడియోలను తీసుకొచ్చింది. నవజాత శిశువుల చర్మంపై హిమాలయ బేబీకేర్‌కు ఉన్న అవగాహన, తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో వచ్చిన మార్పులను ప్రతిబింబిస్తూ తీసుకువచ్చారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు కేవలం సురక్షితమైన ఉత్పత్తులనే కాకుండా, నవజాత శిశువుల రోజువారీ సంరక్షణకు, వాతావరణ మార్పుల నుంచి వారి చర్మాన్ని కాపాడే ప్రత్యేకమైన ఫార్ములాతో కూడిన పరిష్కారాలను కోరుకుంటున్నారు. హిమాలయ జెంటిల్ బేబీ సోప్డిజిటల్ వీడియో లింక్ ఈ జెంటిల్ బేబీ సోప్ ప్రకటన చిత్రం చాలా నెమ్మదిగా, భావోద్వేగభరితంగా సాగుతుంది. ఒక తల్లి తన బిడ్డకు స్నానం చేయించడానికి సిద్ధమవుతుంది. అయితే, అది ఒక సాధారణ దినచర్యలా కాకుండా.. ఎంతో ప్రేమ, బాధ్యత, సరైన నిర్ణయం తీసుకుంటున్నానా లేదా అనే చిన్న ఆందోళనతో కూడి ఉంటుంది. ఆమె తన నవజాత శిశువును సున్నితంగా పట్టుకున్నప్పుడు, ఆమె మనసులో ఒక సాధారణ ప్రశ్న మెదులుతుంది. 'కైసే కరూన్ సహీ సోప్ కా సెలెక్షన్?' (సరైన సోప్‌ను ఎలా ఎంచుకోవాలి?). ఒక చిన్నారి చర్మం విషయానికి వస్తే, ప్రతి చిన్న నిర్ణయం కూడా ఎంత ప్రాముఖ్యమైనదో ఈ కథనం చక్కగా చూపిస్తుంది. ఈ తరుణంలో ఆ తల్లి ఆందోళనను దూరం చేస్తూ.. తండ్రి నమ్మకమైన పరిష్కారంగా 'హిమాలయ జెంటిల్ బేబీ సోప్'ను అందిస్తాడు. ఇది కేవలం ఒక సమస్యకు పరిష్కారం మాత్రమే కాదు, ఆ తల్లిలో ఉన్న సంకోచాన్ని నమ్మకంగా, ఆందోళనను హాయిగా మార్చే ఒక సున్నితమైన భావోద్వేగ ప్రయాణం. ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశం ఈ ఉత్పత్తి ప్రత్యేకమైన ఫార్ములాను తెలియజేయడమే. భారతదేశంలో నెంబర్ వన్ బేబీ సోప్ 'హిమాలయ జెంటిల్ బేబీ సోప్', నవజాత శిశువుల చర్మం కోసం ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది బాదం, ఆలివ్ వంద శాతం సహజ నూనెలతో చేసిన ప్రత్యేకమైన 'ఫైటో ఆయిల్-కాంప్లెక్స్' గుణాలను కలిగి ఉంటుంది. ఇది చర్మం తేమను కోల్పోనివ్వకుండా సున్నితంగా శుభ్రపరుస్తుంది. ఘాటైన రసాయనాలు లేని ఈ ఫార్ములా స్నానం తర్వాత చర్మం పొడిబారకుండా కాపాడుతుంది. శిశువు చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ సున్నితమైన సోప్‌లో 97 శాతం సహజసిద్ధమైన పదార్థాలు ఉన్నాయి. ఇది ప్రతి స్నానం తర్వాత చర్మం పొడిబారకుండా రక్షిస్తూ, దీర్ఘకాలిక మృదుత్వాన్ని అందిస్తుంది. దీని ద్వారా బ్రాండ్ వాగ్దానమైన 'కేవలం శుభ్రపరచడం మాత్రమే కాదు.. అంతకు మించిన సున్నితమైన సంరక్షణ' అనే సందేశాన్ని మరింత బలోపేతం చేస్తోంది. కేవలం శుభ్రపరచడానికే పరిమితం కాకుండా, నవజాత శిశువుల చర్మానికి సున్నితమైన, సమర్థవంతమైన సంరక్షణను అందిస్తోంది. 'సిర్ఫ్ క్లెన్సింగ్ నహీ.. స్కిన్ కీ జెంటిల్ కేర్ భీ' (కేవలం శుభ్రపరచడం మాత్రమే కాదు.. చర్మానికి సున్నితమైన సంరక్షణ కూడా) అనే సందేశంతో, నవజాత శిశువుల చర్మాన్ని రక్షించడానికి ప్రత్యేకంగా రూపొందించిన ఉత్పత్తులను ఎంచుకోవడం ఎంత ముఖ్యమో ఇది చెప్తుంది.

హిమాలయ రిఫ్రెషింగ్ బేబీ సోప్ డిజిటల్ వీడియో లింక్ ఈ రిఫ్రెషింగ్ బేబీ సోప్ ప్రకటన చిత్రం ఒక ఆహ్లాదకరమైన, ప్రేమపూర్వకమైన కథనంతో ప్రారంభమవుతుంది. ఒక తల్లి, ఆమె బిడ్డ మధ్య ఉండే ఆత్మీయ క్షణాల నేపథ్యంలో సాగే ఈ చిత్రం.. వేసవి కాలంలో వచ్చే ఇబ్బందులైన వేడి, చెమట, దురదలను తల్లి సరదా, అతిశయోక్తి హావభావాల ద్వారా చూపిస్తుంది. దానికి ఆ బిడ్డ కూడా అంతే సంతోషంగా స్పందిస్తుంది. భారతీయ తల్లిదండ్రులందరికీ బాగా తెలిసిన 'కిత్నీ గర్మీ' (ఎంత వేడి), 'పసీనా పసీనా' (అంతా చెమటలు) అనే మాటలను ఆ తల్లి సరదాగా వ్యక్తపరుస్తుంది. ఈ ప్రచారం ముఖ్య సందేశం 'సిర్ఫ్ క్లెన్సింగ్ నహీ.. స్కిన్ కీ రిఫ్రెషింగ్ కేర్ భీ' (కేవలం శుభ్ర పరచడం మాత్రమే కాదు.. చర్మానికి రిఫ్రెషింగ్ సంరక్షణ కూడా) అనేది ఉంది. వేసవిలో పిల్లల చర్మ సంరక్షణ అనేది కేవలం సాధారణ శుభ్రతకు మాత్రమే పరిమితం కాదనే 'హిమాలయ బేబీకేర్' ఉద్దేశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. భారతదేశంలో వేసవి కాలం పిల్లల చర్మంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. దీనివల్ల ప్రతిరోజూ చెమట వల్ల వచ్చే చికాకు, వేడి కురుపులు (చెమటకాయలు), అసౌకర్యం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీనికి పరిష్కారంగా హిమాలయ బేబీకేర్ 'రిఫ్రెషింగ్ బేబీ సోప్'ను తీసుకువచ్చింది. ఇందులో పుచ్చకాయ (వాటర్‌మెలన్), వట్టివేరు (వెటివర్), వేప (నీమ్) లతో కూడిన 'ఆక్వాఫ్రెష్ కాంప్లెక్స్' ఉంటుంది. ఇది వేడి, చెమట వల్ల కలిగే చర్మ చికాకును తగ్గించడంలో సహాయపడేలా రూపొందించబడింది. ఈ రెండు సోప్‌లు హిమాలయ బేబీకేర్ విస్తృతమైన విజన్‌ను ప్రతిబింబిస్తాయి. నవజాత శిశువుల సున్నితమైన చర్మ అవసరాల నుంచి భారతదేశ శీతోష్ణస్థితికి అనుగుణంగా వచ్చే వాతావరణ మార్పుల సవాళ్ల వరకు.. పిల్లల చర్మ సంరక్షణకు సంబంధించిన అన్ని రకాల అవసరాలను తీర్చే ఒక ప్రత్యేకమైన సోప్ పోర్ట్‌ఫోలియోను రూపొందించడమే ఈ విజన్ ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ కంపెనీ, బేబీకేర్ డైరెక్టర్ ఎన్వీ చక్రవర్తి మాట్లాడుతూ హిమాలయ బేబీకేర్‌లో మా విధానం ఎప్పుడూ




నవజాత శిశువుల చర్మం, వారి ప్రత్యేక అవసరాలపై ఉన్న అవగాహనపైన ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం తల్లిదండ్రుల ఆలోచనల్లో స్పష్టమైన మార్పును చూస్తున్నామన్నారు. వారు కేవలం సురక్షితమైన ఉత్పత్తులనే కాకుండా, ప్రత్యేకంగా రూపొందించిన పరిష్కారాలను కోరుకుంటున్నారని తెలిపారు. ఈ మారుతున్న మనస్తత్వం మా పోర్ట్‌ఫోలియో అంతటా ప్రత్యేకతపై మరింత దృష్టి పెట్టేలా చేసిందన్నారు. నవజాత శిశువుల సున్నితమైన చర్మ అవసరాలైనా లేదా భారతీయ వేసవి కాలం తెచ్చే వాతావరణ సవాళ్లైనా.. తల్లిదండ్రులు పూర్తి నమ్మకంతో ఆధారపడగలిగే సున్నితమైన, విశ్వసనీయమైన పరిష్కారాలను అందించడమే మా లక్ష్యమన్నారు. ఈ రెండు డిజిటల్ వీడియో క్యాంపెయిన్‌లు డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విడుదల చేయబడతాయి. భారతదేశంలోని యువ తల్లిదండ్రులకు మరింత చేరువ కావడానికి వారితో అనుసంధానం కావడానికి ప్రాంతీయ భాషలలో కూడా వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నీల్సన్ మ్యాట్ మార్చి 26 డేటా ప్రకారం.. డాక్టర్లచే సిఫార్సు చేయబడినది. నీటితో సహా, ప్రాసెస్ చేసిన తర్వాత కూడా 50 శాతం పైగా సహజ స్థితిని కలిగి ఉండే ప్రకృతి నుంచి సేకరించిన పదార్థాలు.

## తెలంగాణ రైజింగ్ -2047 విజన్ తో రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

### - ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేశవరావు
### - జిల్లాలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 02, (తెలంగాణ దిశ) :**జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె. కేశవరావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, డిసిపి సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ లతో కలిసి పోలీసు గౌవర వందనాన్ని స్వీకరించారు. అనంతరం కేశవరావు మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను, వాటి పురోగతిని వివరించారు. జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా గూడులేని పేదలకు నీడ కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మన దేశంలోనే కాక, ప్రపంచ స్థాయిలో నెంబర్ వన్ గా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ -2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ



రైజింగ్ -2047 విజన్ డాక్యు మెంట్ ను రూపొందించటం జరుగుత ందన్నారు. ఇది తెలంగాణ రూపురేఖలనే మార్చేస్తుందని, రాష్ట్రాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్), పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ(ప్యూర్), అరుదైన (రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ)లుగా వర్గీకరించుకుని వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయరంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా ఎదగడానికి ప్రణాళికలు రూపొందిశీచటం జరిగిం దన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన మూడు కుటుంబాలకు చెందిన సభ్యులను శాలువాలు, పండ్ల బోకేలతో



సన్మానించారు. తొలుత కీసర చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కీసర ఎంఆర్ఓ యాదగిరిరెడ్డిలు పూల గుచ్చాలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ వేడుకలలో డిఆర్ఓ మాలతి, ఇంచార్జీ మైనారిటి అధికారి జి. కాంతమ్మ, కలెక్టరేట్ ఎఓ సుజాత, వ్యవసాయ శాఖ చంద్రకళ, సివిల్ సప్లై శాఖ డియం. సుగుణబాయి, డియస్ఓ శ్రీనివాసరెడ్డి, డిఆర్ డిఓ సాంబశివరావు, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, డిటిఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, కలెక్టరేట్ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఏఎస్ రావునగర్, జూన్ 02, (తెలంగాణ దిశ) :**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏఎస్ రావునగర్ డివిజన్‌లో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ డివిజన్ అధ్యక్షులు కె. రమేష్ యాదవ్ జాతీయ జెండాను ఎగుర వేశారు. కమలానగర్ లోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మర్రి మోహన్ రెడ్డి, ఎస్ సి మోర్చా రాష్ట్ర నాయకురాలు సురేఖ, ఏనుగు సీతారాం రెడ్డి, వెంకట రమణాచారి, ఏనుగు మంజుల, బద్దం సుధాకర్ రెడ్డి, శంకర్, గండన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ పిఐ (అతవాలే) ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**లక్డీకాపుల్, జూన్ 02, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం లక్డీకాపుల్ లోని రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా (అథవాలే) సౌత్ ఇండియా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకట స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ తెలంగాణ వాది, రచయిత, సంఘ సేవకుడు జగన్నాథం ప్రవీణ్ కుమార్ గెస్ట్ స్పీకర్ గా ప్రసంగించారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ ప్రసంగం ఆసాంతం ఆకట్టుకుంది. పార్టీ సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేటికి కూడా ఇంకా ఎన్నో సమస్యలను సృష్టిస్తూ మనల్ని మనలా బ్రతక నివ్వకుండా ఇంకా కూడా ఆంధ్ర ప్రజలు (కొంతమంది) తెలంగాణ అస్తిత్వాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని రకాల అడ్డంకులు సృష్టించినా తెలంగాణ ప్రజలు మాత్రం భయపడరని తన్ని తరుముతారని హెచ్చరించారు. పార్టీ సౌత్ జనరల్ సెక్రటరీ గొల్లపల్లి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ అమరవీరులకు రావలసిన గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులు కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశారు కానీ వారికి ఇచ్చిన హామీలను ఏ ప్రభుత్వం అమలు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మరి ఈ మధ్య కాలంలో వారు వేసిన పిటిషన్




ను తెలంగాణ హైకోర్టు స్వీకరించి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందని గుర్తు చేశారు. ఇందుకు అనుకూలంగా కేకే కమిటీని వేసినందుకు గొల్లపల్లి నాగరాజు ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపారు. తెలంగాణ మహిళా ఇంచార్జీ రోజారాణి మాట్లాడుతూ ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే మళ్లీ ఉద్యమం చేయడం తద్యమన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సచిన్ గౌడ్, పరమేశ్వరి, శ్రీనివాస్, వంశీ, కూకట్ పల్లి నియోజకవర్గ సమన్వయకర్త కరుణ్ నాయుడు, బీసీ నేత గోవిందు, సూర్యాపేట జిల్లా సమన్వయకర్త శంకర్ గౌడ్, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం

### - కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్



**కూకట్ పల్లి, జూన్ 02, (తెలంగాణ దిశ) :**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమసమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జీ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని బోయినపల్లి, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్ లలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకలజనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకోవడం,



దాచుకోవటం తరహాలో పాలన సాగిందని రమేష్ ధ్వజ మెత్తారు. సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని, అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా తీసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక గ్రూపుల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే ఉద్దేశంతో పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, బస్సుల కేటాయింపు చేస్తున్నామన్నారు .ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మిస్తున్నామన్నారు. సన్న బియ్యం ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఆహారం అందజేస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ చేసామని, బోనస్ ఇచ్చామని అన్నారు. విదేశీ పెట్టుబడులు తేవడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయ సాధన కోసం కృషి చేద్దాం..

**భువనగిరి, జూన్ 02, (తెలంగాణ దిశ) :**తెలంగాణ అమరవీరుల ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్, టీజేఏసీ కన్వీనర్ మెరుగు మధు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం స్థూప నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభలో మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొన్న అమరులను ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంగా భువనగిరి కేంద్రంగా జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అమరులు శ్రీకాంతాచారి, అముద చిత్తరంజన్, జిట్టా బాలకృష్ణారెడ్డి, ఆకుల జయమ్మ, వేణుకొండలు, కళాకారుడు జహంగీర్ ల ఉద్యమ నేపథ్యాన్ని గుర్తుచేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థూప నిర్మాణ కమిటీ చైర్మన్ మాటూరు అశోక్, వైస్ చైర్మన్ కొత్త బాలరాజు, ఉద్యోగ సంఘాల కో కన్వీనర్, ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, నల్ల కృష్ణ, జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు పోతంశెట్టి కరుణాకర్, టిఎల్ఎఫ్ నాయకులు కొడిమాల



కృష్ణ, కొలుపుల రమేష్, బండారు రవివర్ధన్, శ్రీనివాస్, రాయగిరి శంకర్, ఆటో జాక్ లక్ష్మణ్, సహదేవ్, వినోద్, పోకల ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాలాజీనగర్ పరిధిలో అరగంట విద్యుత్ సరఫరా నిలిపివేత

**జవహర్ నగర్, జూన్ 02, (తెలంగాణ దిశ) :**వంద ఫీట్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 33 కేవీ డిఫెన్స్ కాలనీ, యాప్రాల్, సాకేత్ ఫీడర్ లైన్లను ఒకే ఎం6 టవర్‌పై ఏర్పాటు చేసే పనులతో పాటు దెబ్బతిన్న 33 కేవీ యాప్రాల్ ఫీడర్ కేబుల్ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బాలాజీనగర్ విద్యుత్ శాఖ ఏఈ (ఆపరేషన్) హెచ్. సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు ఉదయం 7.30 గంటల నుంచి 8.00 గంటల వరకు 33/11 కేవీ బాలాజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనరసింహ, ఆనంద్‌నగర్, సాయిబాబా, మహంకాళి, డెంటల్ కాలేజ్, శివాజీనగర్, సంతోష్‌నగర్ 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వెల్లడించారు. ఈ కారణంగా చెన్నాపూర్, లక్ష్మీనరసింహ కాలనీ, శివానగర్, ఆదర్శనగర్, వికలాంగుల కాలనీ, సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్ కాలనీలు, రేణుకానగర్, ముత్తుస్వామి కాలనీ, బీరప్పగడ్డ, భగత్‌సింగ్ కాలనీ, గబ్బిలాలపేట, శాంతినగర్, రాజీవ్‌నగర్, మోహన్ కాలనీ, నవరస కాలనీ, సీపీఐ కాలనీ, జ్యోతి కాలనీ, లెవిస్ ఎన్‌క్లేవ్, వీకే ఎన్‌క్లేవ్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, అయ్యప్ప కాలనీ, సిటిజన్ కాలనీ, ఆనంద్‌నగర్, సాయిబాబా టెంపుల్ కామన్ రోడ్, వెంకటేశ్వర కాలనీ, బాలాజీనగర్




మెయిన్ రోడ్, మార్వాడీ గల్లి, మహంకాళి టెంపుల్ రోడ్, సుక్కమ్మకుంట, సంతోష్‌నగర్, సుబ్రమ్మ కాలనీ, బ్రయ్య కాలనీ, విఘ్నేశ్వర కాలనీ తదితర ప్రాంతాలు ప్రభావితమవుతాయని అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ తాత్కాలిక అంతరాయాన్ని గమనించి సహకరించాలని సాంబశివరావు కోరారు.

# సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు..?

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుం దని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# మేడ్చల్ జిల్లా వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ

## - ఎన్‌టీఈపీ కింద 6 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 02, (తెలంగాణ దిశ) :**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ల్యాబ్ టెక్నీషియన్, సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబొరేటరీ సూపర్ వైజర్ (ఎస్‌టీఎల్ఎస్) పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమాగౌరీ వెల్లడించారు. ఈ నియామకాలలో భాగంగా ఐదు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, ఒక సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబొరేటరీ సూపర్ వైజర్ పోస్టు భర్తీ చేయనున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఇంటర్మీడియట్‌తో పాటు మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీలో డిప్లొమా లేదా సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేసి, ఎన్‌టీఈపీ స్పుటమ్ స్మియర్ మైక్రోస్కోపీ విభాగంలో కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలి. ఎస్‌టీఎల్ఎస్ పోస్టుకు ఏదైనా డిగ్రీతో పాటు మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీలో డిప్లొమా, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, కంప్యూటర్ ఆపరేషన్స్‌లో సర్టిఫికేట్ కోర్సు, ఎన్‌టీఈపీలో కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 46 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. దరఖాస్తు ఫారమ్‌ను జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిగా నింపిన దరఖాస్తుతో పాటు అవసరమైన ధృవపత్రాల జిరాక్స్ ప్రతులతో పాటు రూ.500 డిమాండ్ డ్రాఫ్ట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను జూన్ 3, 4, 5 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేడ్చల్ లోని అంతాయిపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాల యంలో స్వీకరిస్తారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సూచించారు.

# ఎల్ బి స్టేడియంలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

## - జెండాను ఆవిష్కరించిన చైర్మన్ శివసేనారెడ్డి






**హైదరాబాద్, జూన్ 02, (తెలంగాణ దిశ) :**తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన కార్యాలయం ఎల్ బి స్టేడియంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రజల సుదీర్ఘ ఆకాంక్షకు ఫలితమని సాధించుకున్న తెలంగాణలో స్వేచ్ఛ ఆత్మాభిమానం ముఖ్యమని అన్నారు. ఒక దశాబ్ద రాష్ట్రం ఏర్పడిన తర్వాత దశాబ్దకాలం పూర్తిగా విస్మరించబడిన క్రీడారంగం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలనలో అన్ని రంగాల మాదిరిగానే తెలంగాణ క్రీడా రంగా అభివృద్ధికి విశేష కృషి జరుగుతుందని అన్నారు. రెండున్నర సంవత్సరాల్లోనే క్రీడారంగంలో సమూల మార్పును స్పష్టంగా సాధించుకోగలిగామని ఆయన తెలిపారు. తెలంగాణ క్రీడారంగం మరింత వేగవంతంగా అభివృద్ధి సాధిస్తూ అన్ని క్రీడాంశాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలబడాలని ఆకాంక్షించారు. ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రాన్ని ప్రజాస్వామిక స్ఫూర్తితో ఎలా సాధించుకున్నారో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కూడా అదే రకమైన స్ఫూర్తి కనబరచాలని సూచించారు. తెలంగాణ క్రీడారంగం జాతీయ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించాలని ఆమె అభిలాషించారు. ముందుగా జనగణ మన గీతాలాపన అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం ఆలపించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు శ్రీమతి అనిత సుజాత, రవీందర్, శ్రీనివాస్ అశోక్ కుమార్, ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్లు కెఆర్ బట్టర్ అశ్విని దద్పే, షాలిని, పిఆర్ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్, కోచ్ లు, కార్యాలయ సిబ్బంది క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రపురి కాలనీలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు



**కాప్రా, జూన్ 02, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను కాప్రా డివిజన్ పరిధిలోని చంద్రపురి కాలనీలో బిఆర్ఎస్ నాయకుడు సుంకరి సుశీల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమానికి బిఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బిఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. చంద్రపురి కాలనీ యువత, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఆనంద్, శ్రీశైలం, కళ్యాణ్, భరత్, ఆదిత్య, ఎల్లప్ప, సువీర్ తదితరులు పాల్గొన్నారు. జై తెలంగాణ, జై జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు.

# నిజమైన ఉద్యమకారులను గుర్తించండి





**భువనగిరి, జూన్ 02, (తెలంగాణ దిశ) :**రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు నియమించిన కేశవరావు కమిటీ అసలైన ఉద్యమకారులను గుర్తించే విధంగా ప్రయత్నం చేయాలని టీజేఏసీ కన్వీనర్ మెరుగు మధు, అమరవీరుల స్థూప నిర్మాణ కమిటీ చైర్మన్ మాటూరు అశోక్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అనిల్ కుమార్ రెడ్డి ని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలలో నాటి మలి దశ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడుని గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అర్హులుగా చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించిందే కాంగ్రెస్ పార్టీ అని, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. అమరుల కుటుంబాలతో పాటు అర్హులైన ఉద్యమకారుల కుటుంబాలను తప్పక ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థూప నిర్మాణ కమిటీ వైస్ చైర్మన్ కొత్త బాలరాజు, కో కన్వీనర్ బానోతు బాలన్, ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాయగిరి శంకర్, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కుక్కదూగు సోమయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, పిట్టల బాలరాజు, ఎలిమినేటి కృష్ణారెడ్డి, వలిగొండ మాజీ ఎంపీపీ నూతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొరకరానికి కొయ్యగా వెనెజులా..!

మెక్సికో వంటి అనేక దేశాల్లో మాదకద్రవ్యాల ముఠాలు ఎలా చెలరేగుతున్నాయో అందరికీ తెలుసు, 'మెక్సికోలో నిజమైన పాలకులు అవే' అని స్వయంగా ట్రంప్ తాజాగా చెప్పాడు. పక్కనే సరిహద్దు నుంచి పెంటానిల్ అనే డ్రగ్ సరఫరా అవుతున్నదని కూడా గతంలో చెప్పాడు.మరి దానిమీద ఎందుకు దాడి చేయలేదన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. అసలు కారణమేమిటంటే గత పాతికేండ్లుగా వెనెజులా కొరకరాని కొయ్యగా తయారైంది.క్యూబా చమురు అవసరాలు తీరుస్తున్నది, పెద్ద మొత్తంలో చైనాకు సరఫరా చేస్తున్నది, ఒక్క వీటికే కాదు, ఎవరు వస్తే వారికి విక్రయిస్తున్నది. మనదేశం 2024లో 140 కోట్ల డాలర్ల మేర చమురు దిగుమతి చేసుకుంది. ట్రంప్ బెదిరించటంతో 2025లో 81 శాతం తగ్గించింది. తెగించినవాడికి తెడ్డే లింగం అన్నట్లుగా ట్రంప్ ఎలాంటి శషభిషలు లేకుండా తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. కట్టుకథలు చెప్పినా నమ్మేస్థితిలో ప్రపంచం లేదు, శాసించేదిగా అమెరికా లేదు. ఇప్పటికీ బలమైన శక్తిగా ఉన్నప్పటికీ అదుపు చేసే శక్తి దానికి లేదు. ఇంకా ఆలస్యం చేస్తే ఉన్న పట్టు కూడా జారిపోయేట్లు ఉన్నదని భావించి అమెరికా తెగింపునకు దిగింది. భద్రతా మండలిలో ఒక శాశ్వత రాజ్యంగా ఉండి మరో సర్వసత్తాక దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిందంటే ఐరాస ఉండీ లేనట్లే. తాను భాగస్వామిగా ఉండి నెలకొల్పిన అనేక సంస్థలు అనివార్యమై తనకే అడ్డు పడుతుండటంతో క్రమంగా అమెరికా నాశనం చేస్తున్నది. వెనెజులాను ఆక్రమించటం దాని బలహీనతకు చిహ్నం. రష్యాను శాసించలేదని ఉక్రెయిన్ సంక్షోభం వెల్లడించింది. చైనా మిలిటరీ రీత్యా కూడా బలపడుతున్నది.ఈ రెండూ కలిసి వాషింగ్టన్‌ను సవాలు చేస్తున్నాయి.

### మౌనం దాల్చిన 'విశ్వగురు'

అమెరికా ఎత్తుగడల గురించి రకరకాల అభిప్రాయాలు వెలువడుతున్నాయి. మదురోను పట్టుకోవటం కాదని, అసలు లక్ష్యం చైనా అన్నది వాటిలో ఒకటి. చైనాను దెబ్బతీసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, చిప్స్ అందకుండా ఇప్పటికే ఒక వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ప్రపంచంలో చమురు దిగుమతి చేసుకొనే దేశాల్లో చైనా అగ్రస్థానంలో ఉంది. వెనెజులా ఒక ప్రధాన సరఫరాదారు, అక్కడ చైనా పెట్టుబడులు కూడా ఉన్నాయి. అక్కడి చమురును స్వాధీనం చేసుకుంటే చైనాకు సరఫరా నిలిపివేయవచ్చు.మరో ప్రధాన సరఫరాదారు ఇరాన్ మీద కూడా మిలిటరీ చర్య ద్వారా దాన్ని ఆక్రమించుకొనేందుకు అమెరికా చూస్తున్నది. ఇదే సమయంలో మరో ప్రధాన వనరుగా ఉన్న రష్యాను కూడా చైనా నుంచి దూరం చేయాలనే ఎత్తుగడ ఉంది. దానిలో భాగంగానే ఉక్రెయిన్‌లో కోరిన ప్రాంతాలను అప్పగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు ట్రంప్ తీరుతెన్నులు ఉన్నాయి.అయితే అది జరగాలంటే అనేక చిక్కుముడులు ఉన్నాయి. అమెరికా చెలగాటం తమకు ప్రాణగండంగా ఐరోపా భావిస్తే ప్రపంచ రాజకీయాలే మరోమలుపు తిరుగుతాయి. మొత్తమ్మీద చెప్పాలంటే చైనాకు చమురు దొరకకుండా చేయాలనే ఎత్తుగడలో అమెరికా ఉంది. ప్రపంచ ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి వంటిది భారత్ అని చెబుతున్న మన 'విశ్వగురు' నరేంద్రమోడీ మధురో అరెస్టును ఖండించకుండా మౌనముద్ర దాల్చారు. తాను భారత్ పట్ల సంతోషంగా లేనని ఇటీవల ట్రంప్ ప్రకటించాడు. అతగాడిని "సంతుష్టీకరిం చేందుకే" మౌన దౌత్యమా! మొత్తానికి ప్రధానిని అమెరికా ఇరకాటంలో పెట్టింది. చమురుకోసమే అన్నది అందరికీ అర్థమైన అంశం.

### అమెరికా దురాగతాలు

అమెరికా ఒక దేశాధ్యక్షుడిని పదవినుంచి కూల్చివేయటం నికోలస్ మదురోతోనే ప్రారంభం కాలేదు. పనామాలో స్వయంగా మిలిటరీ నియంత మాన్యుయల్ నోరిగాను గద్దెనెక్కించింది అమెరికా. సంబంధాలు చెడిన తర్వాత మాదకద్రవ్యాల నిరోధం పేరుతో అదే ఆ మూడు వందల విమానాలు, 27వేల మంది సైనికులతో పనామా మీద దాడి చేసి అతగాడిని పట్టుకుని అమెరికాలో విచారించి నలభైయేండ్ల జైలు శిక్ష వేసింది.

# కాప్రాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కాప్రా, జూన్ 02, (తెలంగాణ దిశ) :**బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జెండాను పార్టీ ఉమ్మడి డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకొని వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ నాయకులు, కార్యకర్తలు, యువజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బిఆర్ఎస్ పార్టీ పోషించిన కీలక పాత్రను కొనియాడారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# విజయ హైస్కూల్ లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కాప్రా, జూన్ 02, (తెలంగాణ దిశ) :**విజయ హైస్కూల్ ఆదిత్య నగర్ కాప్రాలో 12వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాఠశాల ఆవరణలో ఆర్భాటంగా జరుపుకున్నారు. పాఠశాల కరెస్పాండెంట్ కొప్పునూరు రాజేశ్వర్ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు రాష్ట్ర గీతాన్ని ఆలాపన చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇంకా అనేక వృత్తి, ఉద్యోగుల, ప్రజా సమూహాల పోరాట ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందని తెలిపారు. మన అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన మన తెలంగాణనేల సంస్కృతి, సంప్రదాయాలు చిరస్థాయిగా వెలుగొందాలని ఆకాంక్షించారు. అందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. జై తెలంగాణ నినాదాలతో ప్రాంగణమంతా హోరెత్తించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొప్పునూరి వీణ,ప్రిన్సిపాల్ డివి. బాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఏఎస్ రావునగర్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఏఎస్ రావునగర్, జూన్ 02, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎస్ రావునగర్ డివిజన్ రాధిక చౌరస్తాలో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులుఅర్పించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని పిలుపు నిచ్చారు. జూన్ 2 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అసమానతలు, అవమానాలు, అణిచివేతల నుండి విముక్తి పొంది స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన చారిత్రాత్మకమైన రోజు అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషిని గుర్తు చేసుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కొత్త రామారావు, పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమార స్వామి, పార్టీ సీనియర్ నాయకులు బేతాళ బాలరాజు, మురళి పంతులు, రమేష్ చారి, కందుల లక్ష్మీ నారాయణ, తెలంగాణ పద్మ, కె.సత్తమ్మ, గొల్ల పద్మ, సింగారపు మనమ్మ, కె.కృష్ణ,ఎస్ కె. రహీం, ఎంపీ. దాస్, మొగిలయ్య, సింగారపు రాజు, ఈ.భాస్కర్, పి.సురేందర్ రావు, గోవర్ధన చారి, మాట్ల గిరి,సకినాల రవి, సాయి రెడ్డి, నాగపురి రాజు, సహదేవ చారి, హరినాథ్ రెడ్డి, పంతులు నరసింహ, రత్నాల కనకయ్య, ఆనంద్ చారి,ఎం. రమేష్, పిట్టల రాజు, పాషా, సత్యనారాయణ గౌడ్ సురేష్, పి కుమార్, సాయి, సత్యనారాయణ, ఉపేందర్ గౌడ్, సురేందర్ చారి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన

# గోపినాథ్ ముండే




భారత రాజకీయాల్లో సామాన్య ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారి అభ్యున్నతికై జీవితాంతం కృషి చేసిన నాయకులలో గోపినాథ్ ముండే ఒకరు. గ్రామీణ నేపథ్యంలో జన్మించి, తన కృషి, పట్టుదల, ప్రజాసేవా దృక్పథంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ప్రజలతో మమేకమవడం, వారి కష్టసుఖాలను పంచుకోవడం, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం ఆయన ప్రత్యేకత. 1949 డిసెంబర్ 12న మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన గోపినాథ్ ముండే విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరిచారు. యువజన ఉద్యమాల ద్వారా ప్రజా సమస్యలను దగ్గరగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి రాజకీయాలనే సాధనంగా ఎంచుకున్నారు. భారతీయ జనతా పార్టీ అభివృద్ధిలో మహారాష్ట్ర రాష్ట్రంలో కీలక పాత్ర పోషించిన నాయకులలో ఆయన ఒకరు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసి, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేశారు.

గోపినాథ్ ముండే రాజకీయ జీవితంలో సరళత, స్పష్టత, ప్రజల పట్ల నిబద్ధత ప్రధాన లక్షణాలుగా నిలిచాయి. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా, సమర్థవంతమైన నిర్వాహకుడిగా కూడా ఆయన గుర్తింపు పొందారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో పరిపాలనా రంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణాభివృద్ధి, విద్య, తాగునీరు, రహదారులు, పేదల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రభుత్వ పథకాల ఫలాలు చివరి వ్యక్తికి చేరాలనే సంకల్పంతో పనిచేశారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి గోపినాథ్ ముండే చేసిన కృషి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సామాజిక న్యాయం సాధించడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. అట్టడుగు వర్గాల సమస్యలను శాసనసభల్లో ప్రస్తావిస్తూ, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలను ప్రోత్సహించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. అందువల్లే ఆయనకు గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రజాదరణ లభించింది.

2014లో కేంద్ర మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గోపినాథ్ ముండే దేశవ్యాప్తంగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. గ్రామీణ భారతదేశం అభివృద్ధి చెందితేనే దేశం సమగ్రంగా పురోగమిస్తుందనే నమ్మకంతో ఆయన అనేక కార్యక్రమాలను రూపొందించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో నిరంతరం శ్రమించారు.

2014 జూన్ 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించడం దేశ రాజకీయాలకు తీరని లోటుగా మారింది. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే ఆయన మరణించడం ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఆయనను స్మరించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని కోల్పోయామని పలువురు రాజకీయ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు.

గోపినాథ్ ముండే జీవితం యువతకు గొప్ప స్ఫూర్తి. సాధారణ కుటుంబంలో జన్మించిన వ్యక్తి తన కృషి, నిబద్ధత, ప్రజాసేవ ద్వారా ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని ఆయన నిరూపించారు. అధికారం అనేది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు, ప్రజా సంక్షేమం కోసం వినియోగించాల్సిన బాధ్యత అని ఆయన తన రాజకీయ జీవితమంతా ఆచరణలో చూపించారు.

నేడు గోపినాథ్ ముండే భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, సేవలు, రాజకీయ విలువలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. ప్రజా నాయకుడిగా, సామాజిక న్యాయ సాధకుడిగా, గ్రామీణాభివృద్ధికి కృషి చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయన స్మృతి భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఆయన చూపిన మార్గం నేటి రాజకీయ నాయకులకు, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ తరతరాలకు మార్గదర్శకత్వం అందిస్తూనే ఉంటుంది.



సురేష్ కాలేరు
**సామాజిక, రాజకీయ విశ్లేషకులు**
**సెల్ : 8688178339**

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం స్పష్టత!



పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్ లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో.. చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హార్ముజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్ లో నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్ లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# ఈపీఎఫ్ఓ శుభవార్త.. 31 లక్షల మందికి బెనిఫిట్




ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈపీఎఫ్ఓవీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52 కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..



పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మ్యాజ్ జలసంధిని ఏ నౌక దాటాలని చూసినా నిప్పుపెడతామని ఇరాన్ చేసిన హెచ్చరికలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలు రానున్న రోజుల్లో దేశీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియని అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. దీంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 1,700 పాయింట్ల మేర క్షీణించింది. నిఫ్టీ 24,400 దిగువున కదలాడుతోంది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 1,670 పాయింట్ల మేర పతనమై 78,565 వద్ద ఉంది. నిఫ్టీ 513 పాయింట్లు కోల్పోయి 24,351 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. లార్సెన్, టాటా స్టీల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి. దక్షిణ కొరియా కొస్పి 12 శాతం మేర పడిపోయింది. దాంతో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా.. భారత్ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలై ఐదు రోజులు అవుతుండగా.. ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యుద్ధం తీవ్రమవుతుండటంతో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మదుపర్లను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. భారత్‌లో ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై ఈ ప్రభావం గురించి ఆందోళనలు నెలకొన్నాయి.

యుద్ధం ముదురుతూ ఉంటే.. వాణిజ్యలోటు పెరుగుతుందని, రూపాయి బలహీనపడుతుందని, కార్పొరేట్ ఆదాయాలపై ఒత్తిడి ఉంటుందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో లార్సెన్ అండ్ టర్బో స్టాక్ 7 శాతం మేర కుంగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 3.5 శాతం క్షీణించింది. వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి, జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి, ఏకంగా 92.18 మార్క్‌ను తాకింది.

# ఆయుధాల ఉత్పత్తిపై అమెరికా కీలక సమావేశం!



ఇరాన్‌పై జరిగిన తాజా దాడుల అనంతరం తగ్గిన ఆయుధ నిల్వలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసే అంశంపై చర్చించడానికి ట్రంప్ పరిపాలన వైట్ హౌస్ లో అగ్రశ్రేణి రక్షణ కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం కానుందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సమావేశానికి లాక్‌హీడ్ మార్టిన్ మరియు రేథియాన్‌తో వంటి ప్రధాన కంపెనీల కార్యనిర్వాహకులను ఆహ్వానించినట్లు సమాచారం. ఉ తయారీదారులను వేగంగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేయడంపై ఈ చర్చలు కేంద్రీకృతమవుతాయని ప్రణాళికకు పరిచయమున్న వర్గాలు పేర్కొన్నాయి. అయితే,సోషల్ మీడియా వేదికలో చేసిన ఒక పోస్టులో మాజీ అధ్యక్షుడు ట్రంప్ అమెరికా వద్ద ఆయుధ సామగ్రి "వాస్తవంగా అపరిమితంగా ఉంది" అని, అవసరమైతే ఈ సామగ్రితో యుద్ధాలను "ఎప్పటికీ" విజయవంతంగా కొనసాగించగలమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పెంటగాన్ నిల్వల పునరుద్ధరణ చర్యలు, రాజకీయ ప్రకటనల మధ్య వ్యత్యాసంపై చర్చ కొనసాగతోంది.

# అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా




చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. "బైనా ప్రియమైన క్వెన్," అనిఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు.

అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్–ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది. జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు.

# చాట్‌జిపిటికి పెంటాగన్‌తో ఒప్పందం దెబ్బ..!

అమెరికా రక్షణ శాఖ (పెంటాగన్)తో ఓపెన్ ఎఐ కుదుర్చుకున్న వివాదాస్పద ఒప్పందంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్ తమఎఐ సాంకేతికతను సామూహిక నిఘాకు లేదా అటానమస్ ఆయుధాలకు ఉపయోగించకూడదని నిబంధన విధించడంతో పెంటాగన్ ఆ సంస్థను పక్కన పెట్టింది. ఆ వెంటనేచాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ రంగంలోకి దిగి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా అమెరికాలో చాట్‌జిపిటి యాప్ తొలగింపులు (అన్ఇన్‌స్టాల్) ఒక్కసారిగా 295 శాతం పెరగగా, వన్‌స్టార్ రేటింగ్‌లు 775 శాతం పెరిగాయి. ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి, యుద్ధాల్లో ఉపయోగించడానికి ఓపెన్ ఎఐ అంగీకరించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. ఆంత్రోపిక్‌కి చెందిన క్లాడ్ యాప్ డౌన్‌లోడ్లు 88 శాతం పెరిగి, అమెరికా యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుంది. ఈ వివాదంపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మాన్ స్పందిస్తూ.. పెంటాగన్ ఒప్పందం జరిగిన తీరు అస్తవ్యస్తంగా ఉందని అంగీకరించారు. ఆంత్రోపిక్‌తో పెంటాగన్‌కు విభేదాలు వచ్చిన వెంటనే ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల యూజర్లకు తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు.

# పెట్రోల్ ధరలు పెరుగుతాయా.. తగ్గుతాయా ?




ముంబై, : పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంలో చమురు కొరత నెలకొంది. ఇప్పటికే ఎల్పీజీ ధరను కేంద్రం పెంచింది. యుద్ధం ముగిసే సూచనలు కనిపించడం లేదు. సీజ్‌ఫైర్ కుదిరినా శాశ్వత శాంతి ప్రయత్నాలు ఫలించడం లేదు. మరోవైపు హార్మూజ్‌లో ఇప్పుడు అమెరికా పట్టు సాధించింది. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరుగుతా యని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు గురించి వ్యాప్తమైన ఆందోళనలను తొలగించారు. ప్రభుత్వ స్థాయిలో అలాంటి ప్రతిపాద నలు లేవని ప్రకటించింది.సోషల్ మీడియాలో పెట్రోల ధరలు రూ.5 నుంచి 10 వరకు ధరలు పెరుగుతాయనే తప్పుడు సమాచారం వ్యాప్తి చెందింది. ఈ వార్తలు వాహనదారులు, వ్యాపారుల్లో టెన్షన్‌కు కారణమయ్యాయి. కేంద్రం ట్విట్టర్ ద్వారా తక్షణ స్పందించి, ఇలాంటి ప్రణాళికలు లేనటి వాస్తవాన్ని ప్రకటించింది. 40 ఏళ్లుగా ఇంధన ధరల్లో మార్పు లేకుండా ఉన్న ఏకైక దేశం భారత్. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు 70?80 డాలర్ల మధ్య ఊపందుకున్నా, ప్రభుత్వం పోషక విధానాలతో పౌర భారాన్ని తగ్గించింది. ఈ స్థిరత్వం వాహన రవాణా, వ్యవసాయం, చిన్న వ్యాపారాలకు మేలు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20?30 శాతం పెరిగిన సమయం లో భారత్ ప్రభుత్వం పౌరాభివృద్ధి దృష్ట్యా చర్యలు తీసుకుంటోంది. డీజిల్‌పై వెయ్యి కోట్ల సబ్సిడీ, పెట్రోల్‌పై పన్ను తగ్గించి ధరలను అదుపులో ఉంచింది. దీంతో వీలయినంత తక్కువ ధరలతో పౌరులకు అందిస్తున్నారు.తప్పుడు ప్రచారంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. తాజాగా ప్రభుత్వం ముందస్తు సమాచారంతో అనవసర భయాలను నివారిస్తోంది. ఆర్థిక స్థిరత్వం కోసం ఇంధన విధానం మరింత బలపడుతుందని అంచనా.

# ఐ బొమ్మ రవి పొలిటికల్ అనలిస్ట్ అవతారం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సినిమాల పైరసీ.. వాటిని తన వెబ్సైట్లో అప్లోడ్ చేయడం.. దానిద్వారా అక్రమంగా డబ్బు సంపాదించడం వంటి వాటిని అలవాటుగా మార్చుకున్న ఐ బొమ్మ రవి.. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడు. తెలంగాణ పోలీసులు పట్టుకోవడం.. తమదైన స్టైల్ లో ట్రీట్మెంట్ ఇవ్వడంతో అతడు తన ధోరణి మార్చుకున్నాడు. 100 జింకలను తిన్న పులి శాంతి కపోతంగా మారినట్టు.. అక్రమ వ్యాపారానికి.. దందాలకు అలవాటు పడి.. చివరికి పోలీసులకు చిక్కిన రవి.. ఇప్పుడు పొలిటికల్ ఎనలిస్టుగా మారిపోయాడు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉంది. ఎందుకంటే డిఎంకె కాంగ్రెస్, అన్న డీఎంకే బీజేపీ, టీవీకే పార్టీలు ఇక్కడ పోటీలో ఉన్నాయి. అధికారాన్ని దక్కించుకుంటామని డిఎంకె.. ఈసారి మార్పు స్పష్టంగా ఉంటుందని అన్న డిఎంకె.. ప్రజలు కొత్త తరహా రాజకీయాలను చూస్తారని టీవీ కే నేతలు చెబుతున్నారు రికార్డు స్థాయిలో 91 శాతాన్ని మించి అక్కడ పోలింగ్ నమోదు అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకే పోలింగ్ సమయం ముగియడంతో.. ఆ సమయం నాటికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసులు ఇస్తున్నారు.పోలింగ్ నేపథ్యంలో రవి ట్విట్టర్లో ఒక ట్వీట్ చేశాడు. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్ర ఎన్నికల్లో అధికార డిఎంకె మరోసారి అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందట. విజయ్ పార్టీకి 15 నుంచి 20 వరకు ఓటింగ్ లభిస్తుందట. జన నాయకుడు సినిమా విడుదల కాకముందే లీక్ అయింది. దీంతో తమిళ ప్రజల్లో విజయ్ పట్ల సింపతి పెరిగింది. అది కాస్త టీవీకే పార్టీకి ప్లస్ అయిందని రవి భావిస్తున్నాడు.. అతడు చేసిన ఈ ట్వీట్.. సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. మొన్నటిదాకా పైరసీ వ్యాపారం చేశావు.. ఇప్పుడేమో పొలిటికల్ గా మారిపోయావా.. ఏమైనాప్పటికీ నీ విశ్లేషణ వాస్తవ పరిస్థితికి దగ్గరగా ఉందని కొంతమంది అంటుంటే.. మిగతావారేమో ప్రశాంత్ కిషోర్ లాగా నువ్వు కూడా ఒక సంస్థను ఏర్పాటు చేసి.. కోట్లు సంపాదించుకో అంటూ మరి కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

# సీ ప్లేన్ తో పర్యటకానికి ఊపు

**విశాఖపట్టణం,,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీప్లేన్ సేవలతో పర్యాటకు లకు సరికొత్త అనుభూతిని కల్పించేందుకు సిద్ధమైంది. దీని కోసం వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండుచోట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తి చేశారు. అల్లూరి జిల్లాలోని సీలేరు, జోలాపుట్టు ప్రాంతాల నుంచి సీప్లేను నడిపేందకు ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీప్లేన్‌లు నడిపేందుకు సిద్ధమైంది.. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల కూడా సీప్లేన్‌లు నడిపేందుకు కసరత్తు చేస్తోంది. అమరావతి, తిరుపతి, గండికోట ప్రాంతాలలో సీప్లేన్ ప్లాన్ చేశారు. అయితే ఉత్తరాంధ్రలోని ప్రకృతి అందాలకు, పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీప్లేన్‌లు నడపాలని నిర్ణయించింది. అల్లూరిసీతారామరాజు జిల్లాలో నీటిపై తేలుతూ, గాల్లో ఎగురుతూ ప్రకృతి అందాలను తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. సీప్లేన్ సర్వీసులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.జిల్లాలో సీప్లేన్‌లను జోలాపుట్టు, సీలేరు ప్రాంతాల నుంచి నడిపేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. సీలేరులోరూ. 16.08 కోట్లు.. జోలాపుట్టులో రూ. 16 కోట్లతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సీలేరులో ఉన్న గుంటవాడ జలాశయం దగ్గర ఉన్న మారెమ్మ ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. అక్కడ సమీపంలోనే భూమిని ఈ సీప్లేన్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇక జోలాపుట్టు జలాశయం దగ్గర సీప్లేన్ కోసం ఏర్పాట్లు చేయనున్నారు. పర్యాటకులు సీప్లేన్‌లో విశాఖపట్న నుంచి ముంచంగిపట్టు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ మార్గంలో అరకు అందాలను వీక్షించవచ్చు. లంబసింగి, చింతపల్లి, సీలేరు ప్రాంతాలను.. గిరిజన సంప్రదాయాలు, జీవనశైలిని చూస్తూ అలా సీలేరులో ఏర్పాటు చేసే వాటర్ ఏరోడ్రోమ్ చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.సీప్లేన్ కోసం ఏరోడ్రోమ్‌లు ఏర్పాటు చేస్తే.. దాని చుట్టూ రెస్టారెంట్లు, భవనాలు, రెస్ట్ రూంలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువమంది వస్తుంటారు. ఈ సీప్లేన్‌లు అందబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించవచ్చని భావిస్తున్నారు. అల్లూరి జిల్లాలో రెండుచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌లు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మొత్తం మీద ఉత్తరాంధ్రలోని మన్యంలో రెండుచోట్ల సీప్లేన్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.

# ఉత్తరాంధ్రలో పుంజుకోని ఫ్యాన్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒకప్పుడు దూకుడుగా ఉన్న వైసీపీ ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. కీలక నాయకులు ఉన్నప్పటికీ.. ఎవరికి వారు పార్టీలో స్వతంత్ర నాయకులుగా వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. ఇది .. పార్టీని ముం దుకు తీసుకువెళ్లకపోగా.. మరింత వెనక్కి నెడుతోందని తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కన్నబాబును ఉత్తరాంధ్ర ఇంచార్జ్‌గా నియమించిన తర్వాత.. పార్టీలో సహకారం కొరవడింది. దీంతో ఆయనను కేవలం విశాఖకు పరిమితం చేశారు.అయినా కూడా బొత్స సత్యనారాయణ సామాజిక వర్గం పార్టీలో వేర్వేరు గ్రూపులు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. జిల్లాల పరంగా చూసు కుంటే.. టీడీపీ,జనసేనలకు ఉన్న బలం వైసీపీకి కనిపించడం లేదు. విశాఖలో ఎంపీ భరత్ సహా టీడీపీ సీనియర్లు.. పార్టీని బలంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. కానీ, ఇదేసమయంలో వైసీపీ తరఫున బలమైన వాయిస్ వినిపించే గుడివాడ అమర్నాథ్ వంటి వారికి పార్టీలో సహకారం అంతంత మాత్రమేనన్నది సీనియర్లే చెబుతున్నారు. ఇక, శ్రీకాకుళంలో ధర్మాన సోదరులపైనే వైసీపీ ఆధారపడింది. మాజీ మంత్రిసీదిరి అప్పలరాజును వైసీపీ నాయకులు పక్కన పెట్టేశారు. మరోవైపు.. ఇదే జిల్లాలో జనసేన, టీడీపీ తరఫున కింజరాపు ఫ్యామిలీ సహా.. ఇతర నాయకులు బలంగా పార్టీ లను ముందుకు తీసుకువె ళ్తున్నారు. వీరి దెబ్బతో వైసీపీ ఎక్కడా పుంజుకునే పరిస్థితి కూడా లేదని అంటున్నారు. పోనీ.. పాత నాయకులు అయినా.. బయటకు వస్తున్నారా? అంటే.. కేవలం మీడియా సమావేశాలకే పరిమితం అవుతున్నారు.ఇక, విజయనగరంలో వైసీపీ చీలికలు పేలికలుగా తయారైందన్నది పార్టీలో కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. జిల్లాలో బొత్స ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ద్వారా.. వైసీపీ పెద్ద పొరపాటు చేసిందన్న వాదన వినిపిస్తోంది. ఇక, ఇదేజిల్లాలో జనసేన భారీగా పుంజుకుంటోంది. దీనికి టీడీపీ సహకారం కూడా తోడైంది.

# ఓటరు మ్యాపింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి. వినోద్ కుమార్

**వనపర్తి,తెలంగాణ దిశ :**వనపర్తి జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఓటరు మాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి ఓటరు మాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామ పాలన అధికారులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన మాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిశీలించి అర్హులైన లబ్ధిదా రులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.
పెండింగ్‌లో ఉన్న సాధాబైనామా, భూ భారతి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి నివేదికలు సమర్పించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో విచారణ లో ఉన్న అన్ని రకాల సేవలకు



సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా, ఓటరు మాపింగ్ పనుల పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటరు మాపింగ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# నేరేడి ప్రాజెక్టు డీపీఆర్ రెడీ..

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :**ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా శ్రీకాకుళ జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజి నిర్మాణానికి ఇటీవల అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణం పై ఫోకస్ పెట్టింది.. ఈ క్రమంలో తొలి అడుగు పడింది. తాజాగా నేరడి బ్యారేజీకి సంబంధించి రూ.70 కోట్లతో కొత్త డీపీఆర్ ప్రతిపాద నలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అలాగే ఒడిశా ప్రభుత్వాని కి కూడా త్వరలో లేఖ రాయనున్నారు.శ్రీకాకుళంజిల్లా వాసుల ఎన్నో ఏళ్ల నిజం కాబోతోంది.. దాదాపు 65 ఏళ్ల తర్వాత కీలక ముందగుడు పడింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం కొత్త డీపీఆర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవల వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫై చేసిన సంగతి తెలిసిందే.. దీంతో బ్యారేజీ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో ఏపీ ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త డీపీఆర్ తయారీ, సర్వే సహ ఇతర పనుల కోసం రూ.70 కోట్లు అవసరమని ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపారు.శ్రీకాకుళం జిల్లాలో ఈ నేరడి బ్యారేజి ఆలస్యంకావడంతో నీళ్ల మళ్లింపు కోసం సైడ్ వియర్ నిర్మించారు.. కానీ ఆ ప్రయత్నం విజయవంతంకాలేదు. హిరమండలంలో ఎత్తిపోతలను ప్లాన్ చేసి.. మొత్తం 19.5 డీఎంసీల నీళ్లు మళ్లించాలని భావిం చారు.. కానీ ఆ నిర్మాణం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఇప్పుడు నేరడి బ్యారేజి పనులు చేపట్టి పూర్తిచేస్తే తొలిదశలో లక్షా 48వేల ఎకరాలకు నీళ్లు అందించొచ్చని చెబుతున్నారు. రెండో రెండో దశలో మరో లక్షా 7వేల 280 ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చంటున్నారు. సాగునీ రుతో పాటుగా తాగునీటి సమస్య కూడా తీరుతుందని.. వంశధార– నాగావళి అనుసంధానం ఫలితాలు దక్కుతాయంటున్నారు. శ్రీకాకుళం జిల్లా భామిని మండలం నేరడి దగ్గర బ్యారేజీ నిర్మాణానికి 1961లో తొలి అడుగు పడింది.. అప్పటి నుంచి కోర్టు చిక్కులతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేరడి బ్యారేజీ అంశం గురించి కేంద్రంతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లిన సమ యంలో కేంద్ర జలశక్తిమంత్రి, ఆ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఇటీవల నేరడి బ్యారేజ్‌కు సంబంధించి.. వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తుది తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చేసింది. మరోవైపు ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరినవాటిని పరిష్కరించేందుక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది.

# అనవసర వివాదాలు..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువం టి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణ రావు..జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేం దు కు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావర ణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిం చారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీ మను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవిఅందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయన ను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలం గాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకా రులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించు కుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బెరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు

## కంబదూరు గిడ్డంగిలో ఉద్రిక్తత... ఖాళీల భర్తీపై హమాలీల ఆందోళన

**కళ్యాణదుర్గం,తెలంగాణ దిశ :**కంబదూరు మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగిలో నూతన హమాలీల ఎంపికపై ఉద్రిక్తత నెలకొంది. గిడ్డంగిలో 12 మంది హమాలీలు అవసరం కాగా ప్రస్తుతం 7 మంది మాత్రమే పని చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ కొత్తగా 5 మంది హమాలీ పనికి దరఖాస్తు చేసుకుని అధికారులను కలిశారు. హమాలీల కొరత కారణంగా బియ్యం అన్‌లోడ్‌కు వచ్చిన వాహనాలు మూడు రోజులుగా నిలిచిపోయాయని తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు, తహసిల్దార్ జోక్యంతో పోలీసుల పర్యవేక్షణలో బియ్యాన్ని వివిధ రేషన్ స్టోర్లకు తరలించారు. అయితే ఖాళీలు వెంటనే భర్తీ చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని స్థానికులు కోరారు.

# మావిగన్‌తో జగన్ కు బంపర్ మైలేజ్



**విజయవాడ,తెలంగాణ దిశ :** వైసీపీ ట్రెడిషనల్ పాలిటిక్స్ కి దూరంగా ఉండే పార్టీ. ఒక భిన్నమైన వైఖరితో సాగే పార్టీ. ప్రచారం విషయంలో చూస్తే ఆ పార్టీ తీరే వేరుగా ఉంటుంది. అవతల ప్రత్యర్ధి టీడీపీ అయితే పబ్లిసిటీ విషయంలో చాలా స్పీడ్ గా ఉంటుంది. పైగా వ్యూహాలు ఎత్తుగడలలో టీడీపీని మించిన వారు ఉండరు. అలాంటి పార్టీతో వైసీపీ ఎపుడూ పోటీపడలేని స్థితిలోనే ఉంటుంది. అలాంటివి వైసీపీ మావి గన్ అన్న ఒకే ఒక్క స్టెప్ తో ఏకంగా వంద కోట్ల రూపాయిల విలువ చేసే పబ్లిసిటీని ఫ్రీగా కొట్టేసిందా అన్న చర్చ అయితే సాగుతోంది. మావిగన్ అన్నది వైసీపీ కాకతాళీయంగా అన్నదా లేక మనసులో ఉంచుకుని సరైన సమయంలో వదిలిన పంచ్ నా లేక టీడీపీ కూటమి అమరావతి రాజధాని అన్న బలమైన స్లోగన్ ని ఎంతో కొంత అడ్డుకునేందుకు వేసిన పాచికా అన్నది తెలియదు కానీ మావిగన్ మాత్రం జగన్ నోటి వెంట రాగానే సోషల్ మీడియా మొత్తం షేక్ అయింది. అంతే కాదు ఏపీ రాజకీయమంతా మొదట షాక్ అయింది ఆ మీదట హీటెక్కిపోయింది. ఇక మావిగన్ అన్నది ట్రెండింగ్ లో ఉంటూ ట్రోలింగ్ కా బాప్ అనిపించుకుంది. ఇది నెగిటివ్ ప్రచారమా లేక పాజిటివ్ ప్రచారమా అన్నది పక్కన పెడితే వైసీపీని ఎక్కడో తీసికెళ్ళి పెట్టింది అన్నది మాత్రం వాస్తవం అని అంతా అంటున్నారు. వైసీపీ అధినేత 2017 లో నిర్వహించిన భారీ పాదయాత్ర సమయంలో వైసీపీకి వచ్చిన హైప్ పొలిటికల్ గా హైలెట్ అయిన తీరు అందరికీ తెలిసిందే. ఆ తరువాత అంతటి పొలిటికల్ వైబ్రేషన్స్ అయితే వైసీపీకి ఎక్కడా రాలేదు. అధికారంలో ఉన్నపుడు కానీ గడచిన రెండేళ్ళ విపక్ష పాత్రలో కానీ వైసీపీ డిఫెన్స్ మోడ్ లో ఉంటోంది. చాలా సార్లు సైలెంట్ మోడ్ నే నమ్ముకుంది. ఇక అనేక సార్లు కార్నర్ అవుతూ వస్తోంది. కానీ ఇన్నేళ్ళ తరువాత మళ్లీ నాటి హైప్ వైసీపీకి క్రియేట్ అయింది అంటే దానికి వన్ అండ్ ఓన్లీ రీజన్ మావిగన్ అని అంటున్నారు. మావిగన్ అన్న మూడు అక్షరాల పదం వైసీపీని పొలిటికల్ గా ఏపీ రాజకీయ తెర మీద ఫుల్ ఫోకస్డ్ గా నిలిచేలా చేసింది అని అంటున్నారు. ఇక దీని మీద జరిగిన చర్చ ఇంతా అంతా కాదు అది పాజిటివ్ గా జరిగిందా లేక నెగిటివ్ గా జరిగిందా అన్నది పక్కన పెడితే వైసీపీ అన్న పేరు ప్రతీ చోటా నానేలా చేసింది. ఆ విధంగా చూస్తే ఏప్రిల్ నెల మొదటి తేదీన వైసీపీ అధినేత జగన్ వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. ఆ రోజున ఆయన మావిగాన్ అని ప్రతిపాదించారు. అంతే నాటి నుంచి దాదాపుగా నెల రోజులుగా అదే సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది. ఎంతలా అంటే మరే టాపిక్ కూడా కనీసంగా చర్చకు నోచుకోనంతగా ఈ ఒక్క టాపిక్ తోనే వైసీపీ బహుళ ప్రచారం పొందింది. నిజం చెప్పాలంటే ఈ సమయంలో అంటే వైసీపీ భారీ ఓటమిని అందుకుని విపక్షంలో ఉంటూ కేవలం 11 సీట్లతో చతికిలపడిన వేళ ఆ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు పడుతున్న వేళ వచ్చిన ఈ బూస్టింగ్ కానీ జరిగిన ప్రచారం కానీ రూపాయలలో లెక్క కడితే కచ్చితంగా వంద కోట్ల పై మాటే అంటున్నారు. అంటే పార్టీ ఖజానా నుంచి వంద కోట్లు తీసి పబ్లిసిటీ చేయించుకుంటే వచ్చే పబ్లిసిటీ ఫ్రీగానే వచ్చేసింది అన్న మాట. ఈ ప్రచారం అంతా మీడియానే మోసింది. భారీగా చేసింది. అది మెయిన్ స్ట్రీమ్ మీడియానా లేక సోషల్ మీడియానా లేక డిజిటల్ ఫ్లాట్ ఫారం నా అన్నది పక్కన పెడితే ఒక్క మావిగన్ తో వైసీపీ అచ్చంగా ఉచిత ప్రచారాన్ని వందల కోట్ల దాకా పొందేసింది. ఇందులో జనాలదే తొంబై శాతం పాత్ర అయితే వైసీపీ నుంచి మావిగాన్ ని సమర్ధించుకుంటూ చేసిన ప్రచారం కేవలం పది శాతం మాత్రమే. ఊహించి ఉండదు ఏది ఏమైనా వైసీపీకి ఈ సమయంలో అయితే ఇది బాగా జనంలో ఫోకస్ అయ్యేలా చేసింది మరి ఇది పాజిటివ్ గానా నెగిటివ్ గానా అన్నది పక్కన పెడితే ఒక రాజకీయ పార్టీకి కావాల్సినంత ప్రచారం అయితే దక్కింది. ఆ విధంగా వైసీపీ లక్కీ అనే అంటున్నారు.

# గ్లోబల్ క్యాపిటల్ గా విశాఖ..

## ఏపీకి 11,056 కోట్లు.. ఇదీ బాబు మార్క్ పరిపాలన.. సంపద..

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఒక ఎకో సిస్టం డెవలప్ కావాలంటే అక్కడ అనుకూల పరిస్థితులు సృష్టించాలి. అవి సృష్టించాలంటే అక్కడి నాయకత్వానికి దూర దృష్టి ఉండాలి. అలాంటి దూర దృష్టి ఉన్న నాయకుడు అనుకూ లమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయగలడు. దానికోసం అవకాశాలను సృష్టించగలడు. అంతిమంగా ఆ ప్రాంతాలను గొప్పగా వృద్ధి చేయించగలడు. అలాంటి నాయకుడే ఇప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన దార్శనికత వల్ల ఏపీ కథ మొత్తం మారిపోయింది.ఏ ప్రభుత్వానికైనా ఆదాయం అత్యంత అవసరం. ఎందుకంటే ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయం రావాలంటే ప్రజల్లో నమ్మకం పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలి. అప్పుడే ఆర్థిక వృద్ధి.. అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఏపీ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఏపీ రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండేది. అప్పులు మాత్రం దారుణంగా ఉండేది. ఈ క్రమంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన అనుభవాన్ని మొత్తం రంగరించారు. ఫలితంగా ఏపీ రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది.ఏపీ రాష్ట్రానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయాన్ని పరిశీలనకు తీసుకుంటే.. గత ఆర్థిక సంవత్సరం అద్భుతమైన వృద్ధి కనిపించింది. అంతకుముందు ఏడాదితో పోల్చి చూస్తే ఇది ఏకంగా 25% ఎక్కువ. బడ్జెట్ అంచనాలను దాదాపు 98.4% సాధించింది. 2024-2025లో 8, 847 కోట్లుగా ఉన్న ఆదాయం.. 2025-26 లో 11,056 కోట్లకు చేరుకుంది. డిజిటల్ విధానం, పరిపాలన సంస్కరణల వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల కనిపించింది.. ఈ స్థాయిలో ఆదాయం సాధించడం అంటే మామూలు విషయం కాదు.. పైగా ఇంతటి వృద్ధి అన్ని రకాల వసతులు ఉన్న రాష్ట్రాల్లో కూడా సాధ్యం కాలేదు.

కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. రాజధాని నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతూ ఉండడం.. ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయాలు కనిపిస్తూ ఉండడంతో.. ఏపీ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అమాంతం దూసుకుపోయింది.. ఇదే జోరు గనుక కొనసాగితే వచ్చే రోజుల్లో కూడా ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు“ఆంధ్రప్రదేశ్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఒకప్పటి మాదిరిగా ఒత్తిడి లేదు. అన్ని అనుమతులు త్వరగానే వస్తున్నాయి. భూమి కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి..

ప్రభుత్వం రంగంలోకి దిగి అన్ని రకాల అనుమతులు త్వరగానే లభించేలా చేస్తుంది. ముఖ్యంగా డిజిటల్ విధానంలో భూ వ్యవహారాలు సాగుతు న్నాయి. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ఇవి మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని” భూములు కొనుగోలు చేస్తున్న వారు అంటున్నారు.

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నం లో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపెనీలకు సంకేతాలు పం



పించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది..చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్ గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం కి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు.

ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు. ప్రపంచ పెట్టుబడిదారులకు గుమ్మంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏస్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

# కొంప ముంచుతున్న కృత్రిమ కొరత




**కాకినాడ,తెలంగాణ దిశ:**ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. విపక్షైసీపీఆయకులునిపై నిరసనలు తెలుపుతున్నారు.కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏపీలో ఈ పరిస్థితి నెలకొందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి కొరత లేదని కూటమి అధికారంలో ఉన్న ఏపీలో మాత్రం ప్రజలకు పెట్రోల్,డీజిల్ దొరకడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అయితే సమస్యకు ప్రధాన కారణాలు పానిక్ కొనుగోళు , సరఫరా ఆలస్యాలు, పరిశ్రమల డిమాండ్ మార్పులు అని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 4,500కి పైగా పెట్రోల్ బంకుల్లో 10?70 శాతం మూతపడ్డాయి. కర్నూలు, నంద్యాల్, గోదావరి, విశాఖలో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. రోజువారీ 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9 వేల కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలకు 50 శాతం అధిక డిమాండ్ ఏర్పడటంతో సంక్షోభం తీవ్రమైంది.దొరకదనే కారణంతో చాలా మంది అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు.పానిక్ భయంతో అనవసర కొనుగోళ్లు పెరగడం కొరతకు ప్రధాన కారణం. సాధారణ అమ్మకాలకు రెట్టింపు డిమాండ్ వచ్చింది. పారిశ్రామికులు అధిక ధరల కారణంగా రిటైల్ డీజిల్‌కు మారారు,వ్యవసాయ రంగంలో కూడా డిమాండ్ పెరిగింది. యుద్ధాలు, ఆయిల్ కంపెనీల రెండు రోజుల ఆలస్య సరఫరా, క్రెడిట్‌కు బదులు క్యాష్ డిమాండ్ కృత్రిమ కొరతను మరింత పెంచాయి. సీఎం చంద్రబాబు పరిస్థితిపై సమీక్షలు నిర్వహించారు. అధిక సరఫరా కోరారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కొరత లేదని, పోయోకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు సంస్థల సరఫరా ఆగిపోవడంపై కూడా చర్చించారు.పానిక్ కొనుగోళ్లు తగ్గిస్తే సమస్య త్వరగా సద్దుమణుగుతుంది. ఆయిల్ కంపెనీలు సరఫరాను మెరుగుపరచాలి, పరిశ్రమలకు ప్రత్యేక సరఫరా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం డీలర్లను పరిగణనలోకి తీసుకుని, పారదర్శకత పెంచాలి.

**పొలిటికల్ మైలేజ్ కోసం వైసీపీ:** ప్రజా సమస్యల పట్ల పోరాడాల్సిన అవసరం ప్రతిపక్ష పార్టీకి ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టాల్సిన బాధ్యత కూడా ప్రతిపక్ష పార్టీ మీద ఉంటుంది. కానీ ఏపీలో ఇందుకు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. 2024 ఎన్నికల్లో అక్కడ కూటమి జోరు ముందు వైసిపి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. ప్రతిపక్ష హోదా కోసం అడుక్కోవలసిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది.. ఏపీలో కూటమి ప్రభు త్వానికి సమాంతరంగా మరో పార్టీ లేదు కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ అక్కడ తుడిచి పెట్టుకుని పోయింది కాబట్టి.. వైసిపి నే అనధికారికంగా ప్రతిపక్ష హోదాలో ఉంది. ఆ పార్టీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆ మధ్య రైతుల సమస్యల మీద ధర్నాలు చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక అనధికారిక ప్రతిపక్ష నాయకుడిగా అది ఆయనకులభించిన గౌరవం. ఆయన ఆ పని చేయాలి కూడా.. కాకపోతే ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని చెప్పి ప్రభుత్వంపై అడ్డగోలుగా విమర్శలు చేస్తే జనం అసలు సహించ రు.ప్రస్తుతం మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కొనసాగుతోం ది. ఇప్పటికీ ఇరాన్ హార్మోజ్ జలసంధి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ జల సంధి మీదుగా సరుకు రవాణా కావడం లేదు.

# సొంత నియోజకవర్గాలపై దృష్టి

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలకు పైగా సమయం ఉంది. పైగా వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలే. అయినప్పటికీ వచ్చే ఎన్ని కలపై ఇప్పటి నుంచే కొందరు ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో తమ సొంత ప్రాంతాలను కాదని వేరే ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజకవ ర్గాలకు వెళ్లి పోటీ చేశారు. దీంతో ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో.. వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది కొంతమంది ఎమ్మెల్యేలకు దిగులు పట్టుకుంది. ఇది వాస్తవం కూడా. గత ఎన్నికల్లో అంటే కూటమి ప్రభావం ఉంది. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత కూడా ఉంది. కాబట్టి ఎవరు పోటీ చేశారు.. ఎవరు నిలబడ్డారు.. అన్నది కూడా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు గమనించలేదు. కేవలం పార్టీ గుర్తులు, పార్టీ అధినేతలను చూసి వారు ఓటేశారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి రిపీట్ అవుతుందా అంటే కష్టం. ఎందుకంటే ఐదు సంవత్సరాల పరిపాలన కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఎంతో కొంత వ్యతిరేకత ఏ ప్రభుత్వం పైన అయినా ఉంటుంది. దీనికి చంద్రబాబు మాత్రం అతీతులు కారు. గత 2019 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది కదా. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది ఎ మ్మెల్యేలు తమ తమ సొంత నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకవైపు పనులు చేస్తూనే.. ఎందుకైనా మంచిది అని తమ సొంత నియోజకవర్గాలపై ఒక అడుగు వేశారు. ఇటువంటి వారిలో మాజీ మంత్రులు ఉన్నారు. సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. వీరంతా తరచుగా తమ తమ సొంత నియోజకవర్గంలో పర్యటించడంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా తమ అనుచరుల ద్వారా తెలుసుకుంటు న్నారు. స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వీరు నిరంతరం తెలు సుకునే ప్రయత్నంలో ఉన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ సొంత నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఇప్పటినుంచి లెక్కలు కట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ జాబితాలో మాజీ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే కళా వెంకట్రావుతో పాటు సీనియర్ నాయకులు, జూనియర్ ఎమ్మెల్యేలు ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరి లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించటం. అయితే తమది కానీ నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది తమకు మైనస్ గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు తమ తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేసి మరోసారి గెలుపు గుర్రం ఎక్కి దిశగా ఆలోచన చేస్తున్నారు. అప్పుడు ఎంత వ్యతిరేక ప్రభావం ఉన్నప్పటికీ.. సొంత నియోజకవర్గంలో సొంత అనుచరులు సొంత సామాజిక వర్గం తమకు సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. మరి దీనికి ఎటువంటి పరిస్థితులు వస్తాయి.. పార్టీ అధినేత చంద్రబాబు ఏ విధంగా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# యాక్షన్ మోడ్ లోకి కేటీఆర్...



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రంగంలోకి కేటీఆర్.. ఫస్ట్ స్టెప్‌లోనే సంచలన నిర్ణయం! బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు.. ‘సంపూర్ణ బాధ్యతలు‘ అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు.. ‘సంపూర్ణ బాధ్యతలు‘ అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. రాష్ట్ర స్థాయి కమిటీని అలానే ఉంచి.. జిల్లా, మండల స్థాయి కమిటీలను వెంటనే రద్దు చేశారు. ఇదేసమయంలో తన విచక్షణ మేరకు కీలక నేతలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో తొలి అడుగుగా.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కేటీఆర్ దృష్టి పెట్టారు. దీనిలో జరిగే అవకతవకలను గుర్తించే బాధ్యతను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు అప్పగించారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో చేపట్టిన సర్ ప్రక్రియలో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీలు చేతులు కలిపే ప్రమాదం ఉందని.. బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించే అవకాశం ఉందని కేటీఆర్ అంచనా వేశారు. ఈ క్రమంలో నకిలీ ఓట్లు, దొంగ ఓట్లను గుర్తించడం తోపాటు.. బీఆర్ ఎస్ అనుకూల ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చూడాలని తలసానికి కేటీఆర్ సూచించారు. దీనికి సంబంధించి పార్టీ తరఫున కార్యకర్తలను నియమించుకుని పర్యవేక్షించే అవకాశం ఆయనకు కల్పించారు. ఏ ఒక్క బీఆర్ ఎస్ సానుకూల ఓటు కూడా పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు.గత ఏడాది జరిగిన.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలో బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించారని.. అందుకే తాము నష్టపోయామని చెప్పారు. ఈ నేపథ్యంలో గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సర్ ప్రక్రియను అత్యంత నిశితంగా పరిశీలించాల ని సూచించారు.

అదేవిధంగా రాబోయే ఎన్నికలపైనా కేటీఆర్ ముందస్తుగానే సమీక్షలు నిర్వహించారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేరకు సానుకూలత ఉందన్న విషయాన్ని ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువె ళ్లాలని ఆయన సూచించారు. ప్రజల మధ్య ఉండే నాయకులే గుర్తింపు ఉంటుందని తేల్చేశారు.

తన సోదరి కవిత రాజకీయాలు.. ఆమె పెట్టుకున్న టీఆర్ ఎస్ పార్టీపైనా కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడారు. కొత్త పార్టీ అని పిలుస్తూ.. “కొత్త పార్టీలపై ఎవరూ స్పందించొద్దు. సమయం, సందర్భం చూసుకుని కేసీఆర్ సర్ స్పందిస్తారు. అప్పటి వరకు ఓపికగా ఉండండి. ఎన్ని పార్టీలు వచ్చినా.. కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో రెచ్చిగొట్టే వ్యాఖ్యల విషయంలో మీరు అప్రమత్తంగా ఉండండి“ అని నాయకులకు తేల్చి చెప్పారు. త్వరలోనే జిల్లాలు, మండలాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

# సొంత ఇమేజ్ పై దివ్యదృష్టి...

**కాకినాడ,తెలంగాణ దిశ :**రాజకీయాల్లో వారసత్వాలకు కొదవలేదు. అది పురుషులైనా మహిళలైనా ఇటీవల కాలంలో రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పొలిటికల్ కెరీర్ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని నియోజకవర్గం ఎమ్మెల్యే కీలకమని చెప్పాలి. గత ఎన్నికల్లో తుని నియోజకవర్గ నుంచి మాజీ మంత్రి సీనియర్ మోస్ట్ నాయకుడు యనమల రామకృష్ణుడి కుమార్తె యనమల దివ్య పోటీ చేశారు.. విజయం కూడా దక్కించుకున్నారు. నిజానికి వైసీపీ ఇక్కడ బలంగా ఉంది. స్థానికంగా కూడా వివాదరహితంగా వైసిపి గత ఎన్నికల సమయంలో వ్యవహరించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ తునిలో వైసీపీ విజయం సాధిస్తుందని చాలామంది అంచనా వేశారు. కానీ దీనికి భిన్నంగా తుని పొలిటికల్ తెరపై తొలిసారి యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య విజయం సాధించారు. పైగా ఆ సమయంలో సొంత కుటుంబంలోనే రెండు వర్గాలుగా ఏర్పడిన పరిస్థితి ఉంది, యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టిడిపి ఓటు బ్యాంకు చీల్చే ప్రయత్నం చేశారని పెద్ద ఎత్తున చర్చ కూడా సాగింది. యనమల దివ్య ఘన విజయం దక్కించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఇప్పుడు రెండు సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత మరి ఆమె పరిస్థితి ఏ విధంగా ఉంది.. నియోజకవర్గం అభివృద్ధి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు ప్రజలకు అందుతున్న లబ్ధి వంటివి ఏ మేరకు దివ్యకు పేరు తీసుకు వస్తున్నాయి.. అనేది చూస్తే సానుకూల పరిణామాలే కనిపిస్తున్నాయని స్థానిక రాజకీయ నాయకులు చెబుతున్నారు.గత ఎన్నికల వరకు యనమల రామకృష్ణుడి పేరుతోనూ యనమల కుటుంబం పేరుతో రాజకీయాలు చేసిన దివ్య ఇప్పుడు సొంతంగానే తన ఇమేజ్‌ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి తోడు వైసిపి తరఫున కార్యక్రమాలు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనిపించని పరిస్థితి ఉంది.

ఇది దివ్యకు మరింతగా కలిసి వచ్చింది. వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతురాలు అయిన దివ్య సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అధికారులను ముందుకు నడిపించే విషయంలోనూ చాలా విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ఆమె వేస్తున్న అడుగులు మంచి ఫలితాన్ని అందిస్తున్నాయి. ఎక్కడ ఎమ్మెల్యే పై వ్యతిరేకత కనిపించడం లేదు. సొంత పార్టీలోనూ కలివిడితనం స్పష్టంగా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుని వెళ్లే విషయంలో ఎమ్మెల్యే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలి. నియోజకవర్గంలో అభివృద్ధి విషయాన్ని పరిశీలిస్తున్నప్పటికీ వ్యక్తిగత అంశాల విషయంలో కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞాపనలను కూడా ఆమె పరిశీలనలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో వరుసగా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# జనగామ మున్సిపల్ కౌన్సిల్‌లో ఉద్రిక్తత..!

జనగామ: జనగామలో శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలుకు వేదికపై కుర్చీ ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమావేశం ప్రారంభమైన వెంటనే వైస్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ప్రకారం స్థానం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది బీఆర్ఎస్ నేతలు స్వయంగా కుర్చీ తీసుకువచ్చి వైస్ చైర్మన్‌ను కూర్చోబెట్టడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. వివాదం మరింత పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు వేదికపై కూర్చున్న వైస్ చైర్మన్‌ను పోలీసులు కిందకు దించారు. ఈ చర్యతో బీఆర్ఎస్ నాయకులు మరింత అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడమంచి బాలమణి ఈ వివాదంపై స్పందించారు. ఈ వేదికపై కూర్చోవడానికి ప్రత్యేక హక్కు లేదా నిబంధన లేమీ లేవని, కమిషనర్ మార్గదర్శకాల ప్రకారమే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ ఘటనలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఈ వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు వేదిక ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

హైదరాబాద్: ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైనలివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధపడుతున్న 18 నెలలబాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదని డాక్టర్లుచెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

# నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు
## రూపాయి విలువ 95.07కు చేరిక

న్యూఢిల్లీ, : దేశీయ మార్కెట్లుభారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొసాగుతుండటంతో చమురు ధరలు భగ్గమంటున్నాయి. దాంతో మన సూచీలపై బేర్ పట్టు బిగించింది. దాంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్ల వరకు నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 868 పాయింట్లు పతనమై, 76,623 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 278 పాయింట్లు క్షీణించి, 23,899 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ÷నాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. ఎటర్నల్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రా టెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎంఅండ్ఎం షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది.

# మారణహోమంలో కాసుల వేట..?




వాషింగ్టన్: దేశాల మధ్య యుద్ధం జరిగి... వేలమంది ప్రాణాలు కోల్పోతుంటే... వాటి ఆధారంగా లాభాలు గడిస్తున్న దారుణ పరిస్థితికి వైట్ హౌస్ ఆధారం కావడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. యుద్ధం జరిగితే కొందరికి లాభం. వ్యాపారవేత్తే దేశాధ్యక్షుడు అయితే 'నాకేంటి?' అని అలోచించకుండా ఉంటాడా? ఇరాన్ – ఇజ్రాయిల్, అమెరికా యుద్ధంలో ఇప్పుడిదే తీవ్ర చర్చగా మారింది. ఈ యుద్ధ సమాచారంతో ఇజ్రాయిల్, అమెరికాకు చెందిన అనేక కార్పొరేట్ కంపెనీలు వేలకోట్ల ఇన్సైడర్ ట్రేడింగ్ చేస్తున్నాయనే సమాచారం వెలుగుచూసింది. ఇరాన్పై ఆయా దేశాలు దాడులు చేయకముందు ఆ కంపెనీల షేర్ల ధరలు ఎంత ఉన్నాయి? ఇప్పుడెలా పెరిగాయి? అనే సమాచారాన్ని అంతర్జాతీయ మీడియా ప్రస్తావిస్తోంది. అందరి వేళ్లు వైట్హౌస్ వైపే చూపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వతహాగా కార్పొరేట్ వ్యాపారి కావడంతో 'రహస్య యుద్ధ సమాచారం ఆధారంగా జరుగుతున్న ఇన్ సైడర్ ట్రేడింగ్పై ఆధారాలతోసహా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2026 ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభం ముందూ, తర్వాత కీలక రహస్య సమాచారం ద్వారా కొద్ది మంది స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి భారీగా రాబడులను పెంచుకున్నారు.

ప్రభుత్వ విధాన నిర్ణయాలు బహిరంగం కావడానికి కొన్ని గంటల ముందే దానికి అనుగుణంగా ట్రేడింగ్ జరగడం వెనుక వైట్ హౌస్ నుంచి అందుతున్న ముందస్తు సమాచారమే కారణమనే అనుమానాలు బలపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధ రహస్య సమాచారాన్ని ఉపయోగించుకుని అమెరికాలోని కొందరు ట్రేడర్లు మార్కెట్లో దాదాపు 1.5 బిలియన్ల నుంచి 1.8 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15 వేల కోట్లు) విలువైన అనుమానాస్పద లావాదేవీలు జరిపినట్టు అంచనా. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు వెలువడటానికి కొన్ని నిమిషాల ముందే చమురు మార్కెట్లలో భారీ ఎత్తున బెట్టింగ్లు జరగడం, తద్వారా అజ్ఞాత వ్యక్తులు కోట్లాది రూపాయల లాభాలను ఆర్జించడం ఇన్సైడర్ ట్రేడింగ్ అనుమానాలను బలపరుస్తున్నాయి. ప్రారంభంలో ఇన్సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను కొట్టిపారేసిన వైట్ హౌస్ ఇప్పుడు స్వరం మార్చింది. సున్నితమైన సమాచారంతో ముడి పడి ఉన్న ఫ్యూచర్స్ మార్కెట్లలో బెట్టింగ్లు కట్టవద్దని తన సిబ్బందిని హెచ్చరించింది.

**ఇవిగో సాక్ష్యాలు..:** ఈ ఏడాది జనవరిలో వెనిజులాలో అమెరికా సైనిక చర్యకు దిగడానికి ముందే పాలీమార్కెట్ వంటి ముందస్తు మార్కెట్లలో అనుమానాస్పద బెట్టింగ్లు కనిపించాయి. మార్చి మొదటి వారంలో ఇరాన్పై అమెరికా దాడి చేయబోతోందని అధికారికంగా తెలియడానికి కొన్ని గంటల ముందే కొందరు బెట్టింగ్లు కాశారు. కొద్దిమంది అజ్ఞాత ట్రేడర్లు ఏకంగా 1.2 మిలియన్ల లాభాన్ని పొందడం వెనుక ఇన్సైడర్ సమాచారం ఉందనే అనుమానం ఉంది. మార్చి 23 ఉదయం అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ దాడుల నిలిపివేత గురించి ట్వీట్ చేసే కొద్ది నిమిషాల ముందే, మార్కెట్లో సుమారు 500 నుండి 830 మిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ ఫ్యూచర్స్ చేతులు మారాయి. ప్రకటన రాగానే చమురు ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో ఆ ముందస్తు ట్రేడర్లు ఊహించని లాభాలు పొందారు. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఇన్సైడర్ ట్రేడింగ్ కేసు కావచ్చని చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఇరాన్ మధ్య 15 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించడానికి గంటల ముందు సుమారు 950 మిలియన్ డాలర్ల విలువైన చమురు బెట్టింగ్లు జరిగాయి. ప్రకటన తర్వాత చమురు ధరలు 15 శాతం పడిపోవడంతో ఆ ముందస్తు ట్రేడర్లు మళ్లీ భారీగా లాభపడ్డారు..

**ఇన్సైడ్ ట్రేడింగ్ అంటే...:** ప్రభుత్వ నిర్ణయాలు, యుద్ధ సంబంధిత గోప్య సమాచారం ముందుగానే తెలుసుకుని, ఆ సమాచారాన్ని ప్రజలకు వెల్లడించే ముందు స్టాక్ మార్కెట్లలో లావాదేవీలు చేయడాన్ని ఇన్సైడ్ ట్రేడింగ్ అంటారు. అమెరికాలో ఇది చట్ట విరుద్ధం. దీన్ని యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) పర్యవేక్షిస్తుంది. రహస్య ప్రభుత్వ సమాచారాన్ని ప్రభుత్వంలో ఉన్నవారు కార్పొరేట్ లాబీలకు ముందుగానే తెల పడంతో ఈ ఇన్సైడర్ ట్రేడింగ్ జరుగుతుంది. ఈ విషయం తెలియని సామాన్య ప్రజలు లక్షల కోట్లు నష్టపోతారు. ఆ సొమ్మంతా 'ఇన్సైడర్ల ఖాతాల్లోకి వెళ్లిపోతుంది.

**యుద్ధానికి ముందు...:** అమెరికా ఏ దేశంపైనైనా దాడులు చేయడం మొదలు పెట్టడానికంటే ముందు ఆ దేశ రక్షణ కంపెనీలైన లాకోద్ మార్టిన్, రైథియోన్ టెక్నాలజీస్ వంటి సంస్థల షేర్లు వేగంగా పెరుగుతుంటాయి. ఈ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేది ప్రధానంగా అమెరికాలోని ప్రధాన రాజకీయపార్టీల నేతలే కావడం గమనార్హం !

**ఆయిల్ మార్కెట్లో...:** ఇరాన్తో ఉద్రిక్తతలు పెరిగే ముందు క్రూడ్ ఆయిల్ ఫ్యూచర్స్లో భారీ కొనుగోళ్లు నమోదయ్యాయి, యుద్ధ వార్తలు వెలువడిన వెంటనే ధరలు పెరగడంతో, ఈ లావాదేవీలు చేసినవారికి అనూహ్య లాభాలు వచ్చాయి. ఇన్సైడర్ ట్రేడింగ్ వల్లే ఇది సాధ్యమైందనే అనుమానాలకు అనేక ఆధారాలు లభించాయి.

**వీరే వారు ...:** అమెరికాలో కొంతమంది ఎంపీలు, ఉన్నతాధికారులు తమకు లభించే గోప్య సమాచారం ఆధారంగా స్టాక్స్ కొనుగోళు , అమ్మకాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అమెరికా అధ్యక్షుడే పెద్ద వ్యాపారవేత్త కావడంతో ఆయన సంపద పెరుగుదల పైనా 'ఇన్ సైడర్' అనుమానాలు బలపడుతున్నాయి. ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు జియోపాలిటికల్ అంశమే కాదనీ, ఆర్థిక మార్కెట్లలో గోప్య లాభాల రాజకీయంగా కూడా మారుతున్నాయని నిరూపితమవుతున్నాయి.

**గతంలోనూ...:** ఇన్సైడ్ ట్రేడింగ్ కేసుల్లో గతంలో అమెరికాకు చెందిన కొన్ని కంపెనీలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అమెరికాలో అత్యంత పెద్ద ఇన్సైడ్ ట్రేడింగ్ కేసుల్లో రాజ్ రాజరత్నం కేసు ఒకటి. గల్లియన్ గ్రూప్ అనే వైట్ హౌస్ యుద్ధ సమాచారంతో సరదాగ గరుడుడు మార్కెట్లలో భారీ వ్యాపారం.. వేల కోట్లు ఆర్జిస్తున్న కంపెనీలు గతంలో కొన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు అయినా తీరుమారని కార్పొరేట్లు హెడ్జ్ ఫండ్ ద్వారా రాజ్ రాజరత్నం గోప్య సమాచారం ఆధారంగా ట్రేడింగ్ చేశాడని ఆరోపణలు వచ్చాయి. టెక్నాలజీ కంపెనీల్లోని ఉన్నతాధికారుల నుంచి సమాచారం సేకరించినట్టు నిరూపితమవడంతో 2011లో కోర్టు అతన్ని దోషిగా తేల్చి 11 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఈ కేసు ద్వారా ఇన్సైడ్ సమాచారం ఆధారంగా భారీ లాభాలు పొందడం ఎలా జరుగుతుందో బాహ్య ప్రపంచానికి స్పష్టంగా తెలిసింది.

మరో కేసులో ప్రముఖ వ్యాపారవేత్త మార్తా స్టీవర్ట్ ఇమ్ క్లోన్ సిస్టమ్స్ కంపెనీ షేరు పడిపోతుందనే గోప్య సమాచారం ముందే తెలుసుకుని అమ్మేసింది. ఆ తర్వాత ఆమెపై కేసు నమోదు చేసి శిక్ష విధించారు. అమెరికా ఎంపీ క్రిస్ కొలిన్స్ ఒక బయోటెక్ కంపెనీ విఫలమవుతుందని ముందే తెలుసుకుని తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు షేర్లు అమ్మి నష్టాన్ని తప్పించుకున్నారు.

**తాజాగా ...:** ఇరాన్ ఉద్రిక్తతల సమయంలో అమెరికాకు చెందిన ఆయిల్ ఫ్యూచర్స్, డిఫెన్స్ కంపెనీల షేర్లలో అసాధారణ పెరుగుదల కనిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ తయారీ సంస్థల్లో ఒకటైన లాక్హీద్ మార్టిన్ కంపెనీ యుద్ధ ఉద్రిక్తతల సమయంలో షేర్ల ధరలు అనూహ్యంగా పెరుగుతుండటం గమనార్హం. వ్యాన్గార్డ్, బ్లాక్ వంటి ఇన్వెస్ట్మెంట్ ఫండ్స్ పబ్లిక్ కంపెనీ, మిస్సైల్స్, రాడార్ టెక్నాలజీ తయారీ సంస్థ అయిన రైథియన్ టెక్నాలజీస్ షేర్లు కూడా భారీగా పెరిగాయి. ఈ సంస్థలు అమెరికా రక్షణ శాఖతో పెద్ద పెద్ద కాంట్రాక్టులు చేస్తుంటాయి. మధ్యప్రాచ్య దేశాలకు సరఫరా పెరిగినప్పుడల్లా ఈ కంపెనీల లాభాలు అనూహ్యంగా పెరుగుతుండటం గమనార్హం !

**సహించం: వైట్ హౌస్:** వైట్ హౌస్ మొదట ఈ ఆరోపణలను పట్టించుకోకపోయినా ఏప్రిల్ నాటికి తన సిబ్బందికి అంతర్గత హెచ్చరికలు జారీ చేసింది. అత్యంత కచ్చితమైన సమయంలో జరుగుతున్న ఈ లావాదేవీలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయనీ, ఇలాంటి అక్రమ లాభార్జనను సహించబోమని అధికారులు హెచ్చరించారు. దీనిపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్ఎస్), సిఎఫ్‌సి వంటి నియంత్రణ సంస్థలు రంగంలోకి దిగి విచారణ జరపాలని అక్కడి చట్టసభ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలపై పర్యావ'రణం'
## ఇది నేల కోతకు సంకేతం



మానవాళి అభివృద్ధిలో పర్యావరణానిది కీలకపాత్ర. అది ఎంత ఆరోగ్యంగా ఉంటే, మనం కూడా అంత ఆరోగ్యంగా ఉంటాం. మన చుట్టూ ఉన్న జీవ, నిర్జీవ అంశాలన్నింటినీ పర్యావరణం అంటారు. పర్యావరణ ఆరోగ్యం అనేది ప్రజారోగ్యంలోని అతిపెద్ద రంగాలలో ఒకటి. ఒక ప్రాంతంలోని భౌతిక, రసాయన, సాంస్కృతిక వాతావరణం, ఆ ప్రాంత పర్యావరణ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఇది ఆ ప్రాంతంలోని కాలుష్య స్థాయి, జీవావరణ వైవిధ్యం, పరిశుభ్రమైన తాగునీరు లభ్యత, పారిశుధ్య పరిస్థితులు, వ్యవసాయ ఉత్పాదకత వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పర్యావరణ సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.6 కోట్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. అంతేకాక, వందకు పైగా అనారోగ్యాలు పర్యావరణ ఆరోగ్య సమస్యలతో నేరుగా ముడిపడి ఉన్నాయని కూడా ఆ నివేదిక పేర్కొంది.155 దేశాలు తమ పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును కల్పించినప్పటికీ, భూమి, గాలి, నీరు, రసాయన కాలుష్యం వంటి "పర్యావరణ ప్రమాదాల" వల్ల 23 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. పర్యావరణ మార్పులు ప్రజల జీవనోపాధికి, ఆహార భద్రతకు ముప్పు తెస్తున్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద పర్యావరణ సమస్యలలో వాయు కాలుష్యం ఒకటి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 42 లక్షల నుంచి 70 లక్షల మంది మరణిస్తున్నట్టు అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రతి పది మందిలో తొమ్మిది మంది అధిక కాలుష్య కారకాలను కలిగి ఉన్న గాలిని పీల్చుకుంటున్నారు. నేడు ఢిల్లీ పరిస్థితి చూశాం. ప్రజలు ఇంట్లో కూడా మాస్కుతోనే జీవిస్తున్నారు. వీరిని కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులదే కదా. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, భూమిపై సముద్ర మట్టం సంవత్సరానికి సగటున 3.2 మి.మీ పెరుగుతోంది. ఈ శతాబ్దం చివరి నాటికి అది దాదాపు 0.7 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పెరుగుదల వల్ల సముద్ర తీర ప్రాంతాలు ముంపునకు గురై, సుమారు 34 కోట్ల నుంచి 48 కోట్ల మంది సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. ప్రతి గంటకు 300 ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో అడవులు నరికివేయబడుతున్నాయి. ఇలాగే కొనసాగితే, 2030 నాటికి ఇప్పుడున్న అడవులలో కేవలం పదిశాతం మాత్రమే మిగిలి ఉండవచ్చు. మహాసముద్రాలు భూమి వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్‌లో 30శాతం గ్రహిస్తాయి. అధిక కార్బన్ డయాక్సైడ్ వల్ల సముద్ర జలాలు ఆమ్లీకరణకు గురవుతున్నాయి. దీనివల్ల 2050 నాటికి పగడపు దిబ్బలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన నేలలో కనీసం 3 నుంచి 6శాతం సేంద్రీయ పదార్థం ఉంటుంది. కానీ ప్రపంచంలో చాలా చోట్ల ఇది ఉండాల్సిన దాని కంటే చాలా తక్కువగా ఉంది. ఇది నేల కోతకు సంకేతం. మన దేశంలో పర్యావరణ పనితీరును మెరుగుపరచడానికి ప్రభుత్వానికి, పరిశ్రమలు, ప్రజలు కలిసి కృషి చేయాలి. ఈ పని కోసం అనేక కోణాల నుండి ప్రయత్నాలు అవసరం. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం కొత్త నియమాలను రూపొందించాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. గాలి, నీటి కాలుష్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, జీవవైవిధ్యం వంటి విషయాలకు సంబంధించిన నియమాలను మరింత పటిష్టం చేయాలి. పర్యావరణ పనితీరు సూచిక వంటి సంస్థల నుండి లభించిన డేటాను ఉపయోగించుకుని కాలుష్యానికి సంబంధించిన బలహీనమైన ప్రాంతాలను గుర్తించి, వాటికి తగిన పరిష్కారాలను కనుగొనాలి. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని వేగవంతం చేయాలి. బొగ్గు వంటి ఇంధనాల వాడకాన్ని దశలవారీగా తగ్గించి, దాని స్థానంలో కాలుష్య రహిత సాంకేతికతను ప్రోత్సహించాలి. గాలి నాణ్యతను మెరుగుపరచడానికి 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. దీనిలో పారిశ్రామిక ఉద్గారాలను నియంత్రించడం, ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడాన్ని నివారించడం వంటి చర్యలు ఉంటాయి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించడం, వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించడం,చెరువులు, నదుల వంటి నీటి వనరులను కాపాడటం కూడా అవసరం. స్థానిక ప్రజలను పర్యావరణ పరిరక్షణలో భాగం చేయడం ద్వారా, ఈ ప్రయత్నాలు మరింత విజయవంతమవుతాయి.

# గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్..
## గ్యాంగ్ సమాచారంతో మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు

హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు ఫెర్టిలిటీ సెంటర్లకు మురుగన్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ ఇచ్చిన సమాచారం మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో గుజరాత్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆదిలాబాద్‌లో గత ఏడాది వరకు ఇటుకల బట్టీలో పని చేసిన మురుగన్, కేవలం ఒక్క ఏడాదిలోనే చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా ఎదిగాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. గత ఏడాది చైతన్యపురి కేసులో మురుగన్ పేరు వెలుగులోకి వచ్చింది. గత ఏడాది మూడు నెలల పాటు జైల్లో ఉన్న అతడు జూలైలో విడుదలయ్యాడు. ఆపై దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. అతడి భార్య కృష్ణవేణి మరో గ్యాంగ్‌ను నడుపుతున్నట్టు గుజరాత్ పోలీసులు గుర్తించారు. ఈ మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలోనే 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం మురుగన్ గ్యాంగ్ సభ్యులు గుజరాత్ పోలీసుల అదుపులో ఉన్నారు. వారి విచారణలో మురుగన్ గ్యాంగ్‌కు మూడు ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

మురుగన్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని గుజరాత్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఫెర్టిలిటీ సెంటర్ల ప్రమేయానికి సంబంధించి పూర్తి స్థాయిలో గుజరాత్ పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలావుంటే



హైదరాబాద్‌లోని ప్రముఖ నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేశారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే.

ఈ విషయంపై నోవా సంస్థ నిర్వాహకులు క్లారిటీ ఇచ్చారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌కు.. తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ ఫర్టిలిటీ సెంటర్లపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేయలేదని వెల్లడించారు.

చట్టానికి అనుగుణంగా తాము క్లినిక్ సెంటర్లు నిర్వహిస్తున్నామని, క్లినికల్, ఎథికల్, లీగల్ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సోషల్ మీడియాలో తమ ఫర్టిలిటీ సెంటర్లపై అసత్యప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈఆరోపణలు పూర్తి అవాస్తవమని, ఎలాంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు తమ సెంటర్లపై జరగలేదని వివరణ ఇచ్చారు. రోగులకు ఉత్తమసేవలు అందించడమే తమ లక్ష్యమని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

# కుప్పం విమానాశ్రయానికి తొలగిని అడ్డంకులు..!
## – భూసేకరణపై పిటిషన్లు కొట్టివేసిన సుప్రీం

చిత్తూరు: చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కుప్పం విమానాశ్రయ ప్రాజెక్టుకు పెద్ద ఊరట లభించింది. భూసేకరణపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలకు ముగింపు పలుకుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కుప్పం విమానాశ్రయం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ముందుగా ఏపీ హై కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈప్రాజెక్టు కోసం సుమారు 150 ఎకరాల భూమిని సేకరించేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చింది. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవంటూ చక్రపాణి రెడ్డి, ఇతరులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ పిటిషన్లు కూడా ముగిసినట్లు సుప్రీంకోర్టు స్పష్టం



చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఉన్న న్యాయపరమైన అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. ఈ తీర్పుతో కుప్పం విమానాశ్రయ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయి.

# సినిమా



## నవ్వించేందుకు మళ్లీ వస్తున్నారు



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా తరుణ్‌భాస్కర్ దర్శకత్వంలో ఎనిమిదేండ్ల క్రితం వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమా ఎంతటి విజయాన్ని అందుకున్నదో తెలిసిందే. కల్ట్ కామెడీ మూవీగా ఆడియన్స్‌ని నుంచి కితాబులందుకున్న ఈ చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న సినిమా 'ఈఎన్‌ఈ రిపీట్'. విశ్వక్‌సేన్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి కలిసి నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ థాయిలాండ్‌లో జరుగుతున్నది. నెలరోజుల పాటు ఈ షెడ్యూల్ సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన స్టిల్‌లో వింటేజ్ కన్వర్టిబుల్ కారులో హాయిగా కూర్చుని, ఎంతో ఉత్సాహం కనిపిస్తున్న విశ్వక్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమానులను చూడొచ్చు. ఈ చిత్రానికి కెమెరా: ఏజే ఆరోల్, సంగీతం: వివేక్ సాగర్.

## సమీరా రెడ్డి గ్రాండ్ రీ-ఎంట్రీకి సిద్ధం...



ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి మళ్లీ వెండితెరపై మెరిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె రీ-ఎంట్రీపై వస్తున్న వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందిన సమీరా, పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైంది. అయితే ఇప్పుడు మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఓ స్టార్ హీరో సినిమాలో సమీరా రెడ్డి కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా, ఇప్పుడు తన వయస్సు, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పేరు కోసం కాకుండా, కథలో బలం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో కూడా సమీరా రెడ్డి అభిమానులతో టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ఆమె పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి తన వ్యక్తిగత అనుభవాలను నిజాయితీగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే పలువురు సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో సక్సెస్ సాధిస్తున్న నేపథ్యంలో, సమీరా రీ-ఎంట్రీపై కూడా అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఒక మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు. అయితే ఆమె నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? వంటి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి. మొత్తానికి, సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల హవా మరింత పెరగనుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## చిరుతో బాబీ సినిమా.. నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.

## నా జుట్టు మెరుపు వెనుక ఉన్న రహస్యం ఇదే... శ్రేయా ఘోషాల్



ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ తన పొడవైన, నిగనిగలాడే జుట్టు వెనుక ఉన్న రహస్యాన్ని అభిమానులతో పంచుకున్నారు. లండన్‌లో బ్రిటిష్ వోగ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన జుట్టు అందానికి కారణంఒక సాధారణ భారతీయ చిట్కాఅయిన 'కొబ్బరి నూనె' అని ఆమె వెల్లడించారు. ఈ సింపుల్ సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌అవుతోంది. కన్సర్ట్ టూర్‌లో భాగంగా లండన్ వెళ్లిన శ్రేయా, అక్కడి ప్రతిష్ఠాత్మక ఓ2 ఎరీనాలో హౌస్‌ఫుల్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఇంటర్వ్యూలో, "మీ జుట్టు ఇంత అందంగా, మెరిసిపోతూ ఎలా ఉంటుంది?" అని అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ "ఇండియన్ చిట్కా...కొబ్బరి నూనె" అనినవ్వుతూ చెప్పారు. ఈ కచేరీలో ఆమె పొడవైన జుట్టుతో ప్రత్యేకంగా కనిపించ గా, ఆ లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపించారు. ఇదే వేదికపై ఆమె లెజెండరీ సింగర్ ఆశా భోస్లేకునివాళి అర్పించారు.ఆశా ఆలపిం చిన "దమ్ మారో దమ్", "అభీ నా జావో ఛోడ్ కర్" వంటి క్లాసిక్ పాటలను పాడి ఆమె సంగీత సేవలను గుర్తుచేసుకున్నారు. ఒక అంతర్జాతీయ స్టార్‌గా ఉండి కూడా శ్రేయా ఘోషల్ తన మూలాలను మర్చిపోకుండా, భారతీయ సంప్రదాయ పద్ధతులనే అనుసరించడం ఆమె సరళతను తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.

## పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్‌లోకి మరో బ్యూటీ!



ఈ మధ్యకాలంలో బాగా వార్తలలో నిలుస్తోన్న అంశం.. సెలబ్రిటీల 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్'. సోషల్ మీడియా అకౌంట్స్‌లో ఫాలోయర్స్‌ని పెంచుకుంటూ, వారికి అందాల ఎర వేస్తూ, సబ్‌స్క్రిప్షన్ వైపు నడిపించుకుంటున్నారు. కాస్త పేరున్న భామలందరూ ఇప్పుడీ బాటలోనే నడిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విష్ణు ప్రియ, అనన్య నాగళ్ల వంటి నటీమణులు ఈ పద్ధతి ద్వారా తమ సోషల్ మీడియా క్రేజ్‌ని, ఆదాయ మార్గంగా మార్చుకోగా.. ఇప్పుడు మరో సోషల్ మీడియా స్టార్ అషు రెడ్డి, కూడా అదే బాటలో పయనిస్తున్నారు. తాజాగా ఆమె కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్' ట్రెండ్‌లోకి అడుగుపెట్టినట్లుగా చెబుతూ ఓ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడా వీడియో వైరల్ అవుతోంది. నటిగా, బిగ్ బాస్ ఫేమ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ బ్యూటీ, తన ఫాలోయర్స్ కోసం నెలకు రూ. 399 రుసుముతో ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లుగా ఈ వీడియోలో నవ్వుతూ తెలుపుతున్నారు. ప్రస్తుతం ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు మిలియన్లకు పైగా ఫాలోయర్స్ ఉన్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, తాజా ఫొటో షూట్స్‌తో సందడి చేసే అషు రెడ్డి, తన పాపులారిటీని క్యాష్ చేసుకునే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. సబ్‌స్క్రిప్షన్ ఫీచర్‌ను లాంచ్ చేసిన ఒక్క రోజులోనే ఆమెకు దాదాపు 700 మందికి పైగా సబ్‌స్క్రైబర్లు చేరడం విశేషం. ఈ లెక్కన చూస్తే, కేవలం ఒక్క రోజులోనే దాదాపు రూ. 3 లక్షల ఆదాయాన్ని సునాయాసంగా అందుకున్నారని తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ సబ్‌స్క్రైబర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే అమ్మడి పరువాల పవర్ అలాంటిది మరి.రామ్ గోపాల్ వర్మకే మతిపోగొట్టిన అందం అషు రెడ్డి సొంతం. అలాంటి భామ అందరికీ పరువాల విందు ఇస్తానంటే, పైకం చెల్లించకుండా ఉండగలరా? అందుకే, సబ్‌స్క్రైబర్ అయ్యేందుకు క్యూ కడుతున్నారు. తెలుగు సినిమాల్లో కొన్ని పాత్రలతో మెరిసినప్పటికీ, అషు రెడ్డికి సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ అసాధారణమని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆమె షేర్ చేసే గ్లామరస్ ఫోటోషూట్స్, వీడియోలకు యూత్ నుండి భారీ స్థాయిలో ఆదరణ లభిస్తుంటుంది. తనకంటూ ఉన్న ఈ బలమైన ఫాలోయింగ్‌ను, అభిమానులకు ఇలా సబ్‌స్క్రిప్షన్ పేరిట కొత్త ఆదాయ వనరుగా మార్చుకుంటోంది. ప్రస్తుతం ఈ అంశంపైనే భారీ స్థాయిలో చర్చలు నడుస్తున్నాయి. ఈ సబ్‌స్క్రిప్షన్ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదులు అందుతున్నట్లుగా తెలుస్తోంది. ఆల్రెడీ విష్ణు ప్రియపై కేసు కూడా నమోదైంది. మరి, ఈ విధానానికి అంతం, అదుపు.. ఏ రూపంలో ఉంటుందనేది తెలియాలంటే మాత్రం వేచి చూడాల్సిందే.

## యాక్షన్ మోడ్‌లో రౌడీ జనార్ధన



శ్రీకాకుళం నేపథ్యంతో కూడిన 80వ దశకపు పొలిటికల్ యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్ధన'. అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో కీర్తిసురేశ్ కథానాయిక. రవికిరణ్ కోలా దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ మేకోవర్, ఆయన సంభాషణలు పలికిన తీరు, అభిమానుల్నీ, సినీ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను కూడా పెంచింది. దిల్‌రాజు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మే చివరివారం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలుకానున్నది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఓ పాటను కూడా చిత్రీకరిస్తారు. ఇదిలావుంటే.. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని ఇన్‌సైడ్ టాక్.

ఈ ఎపిసోడ్‌లో విజయ్ పూర్తి యాక్షన్ మోడ్‌లో కనిపిస్తారట. మునుపెన్నడూ లేనంతగా ఊరమాస్ పాత్రలో విజయ్ నటిస్తుండటంతో ఈ సినిమా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. షూటింగ్ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేయనున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215